# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక



కలల్ని పదిలంగా కాపాడుకో!
కలలు మరణిస్తే జీవితం
రెక్కలు తెగి ఎగురలేని విహంగం -
కలల్ని పదిలంగా కాపాడుకో!
కలలు ఇగిరిపోతే జీవితం
మంచు గడ్డకట్టిన బీడుభూమి –

- లాంగ్స్టన్ హ్యూస్

ఫిబ్రవరి 2007 సంచిక

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి

Editor@Prajakala.org

సూచిక

## కవిత్వం:


నెరవేరని కల ఏమవుతుంది? - లాంగ్స్టన్ హ్యూస్ ........ 3

ఐనా నేను లేస్తాను! - మాయా ఏంజిలో ........ 4

పొయట్రీ ఇన్ మోషన్ - రవికిరణ్ తిమ్మిరెడ్డి ........ 7

చెట్టు- బాలుడు - ఇంద్రాణి పాలపర్తి ........ 8

స్పృహ - ఎల్సైన్ ........ 8

కత్తి అంచు రాత్రికి వీరుడి వాగ్దానం - రాజు ........ 9


## కథలు:


బలిపశువు - బి.అజయ్ ప్రసాద్ ........ 12

చష్మా - షఫీ ........ 22


## ఇంటర్వ్యూ:


డెత్- రో పై ఉన్న ప్రఖ్యాత జర్నలిస్ట్ ముమియా అబు- జమాల్ తో ఇంటర్వ్యూ ........ 36


## నవల/ సీరియల్ :


ప్రజల మనిషి – 4 - వట్టికోట ఆళ్వార్స్వామి ........ 43

## నెరవేరని కల ఏమవుతుంది? - లాంగ్‌స్టన్ హ్యూస్

నెరవేరని కల ఏమవుతుంది?
ఎండలో ద్రాక్షలా కుంగిపోతుందా ?
లేదూ మానని పుండులా మండిపోతుందా?
లేదూ కుళ్ళిన మాంసంలా కంపుకొడుతుందా?
లేదూ తియ్యదనం పొంగిపొర్లే పానకమవుతుందా?
బహుశా బరువెక్కుపై కుంగిపోతుందేమో -
ఏమో – ఉండి ఉండి పేలిపోతుందేమో ?

## ఐనా నేను లేస్తాను!

\- మాయా ఏంజిలో



నువ్వు నీ చేదైన అబద్ధాలతోటీ
వంకర రాతలతోటీ
చరిత్రలో నన్ను అణిచెయ్యాలని
చూస్తావు -
నన్ను నీ కాలికింద దుమ్ములా తొక్కేయాలని
చూస్తావు -
అయినా నేను
లేస్తాను – ఆ దుమ్ములాగానే !

జీవం తొణికిసలాడే నా ఆత్మవిశ్వాసం చూస్తే
నీ కెందుకంత కినుక?
ఎందుకలా మొఖం మాడ్చుకున్నవ్ ?
నా నట్టింట్లో నిరంతరం ఉబికే జల వూటలున్నట్లు
నేను ఉరకలేస్తున్నందుకా ?

సూర్యులూ చంద్రుల్లానే
కెరటాలు ఎగసినంత ఖచ్చితంగానే
ఆకాశాన్నంటే ఆశల్లానే,
నేనింకా లేస్తూనే ఉంటాను!

నేను కుప్పకూలడం
చూడాలనుకున్నవ్ కదా
వంచిన తలతో – వాలిన కళ్లతో
కన్నీటి చుక్కల్లా రాలిపోయే
భుజాలతో
దయనీయమైన ఏడ్పులతో
సొమ్మసిల్లిపోయి –

ప్రపంచాన్ని ధిక్కరించే నా గర్వం

నిన్ను కించపరుస్తోందా
మా ఇంటి వెనుక బంగారు గనులున్నట్టు
నేను గలగలా నవ్వుతుంటే
నీకు ముళ్ళమీద ఉన్నట్టుందా

నువ్వు నీ మాటలతో నన్ను కాల్చేయవచ్చు
నువ్వు నీ చురకత్తి చూపులతో కోసెయ్యవచ్చు
నీ అంతులేని ద్వేషంతో చంపెయ్యవచ్చు
ఐనా నేను లేస్తాను – గాలిలా !

నేను సెక్సీగా ఉండడం
నీ కిబ్బందిగా ఉందా!
నా తొడలు కలిసిన చోట
వజ్రాలున్నట్టు
నేను నాట్యం చేస్తుంటే
నీకు తెగ ఆశ్చర్యంగా ఉందా!

నిరంతర అవమానాల
చరిత్ర గుడిసెల్లోంచి
లేస్తాన్నేను!
నొప్పిలో వేళ్ళూనుకున్న
గతం లోంచి
లేస్తాన్నేను!
ఉవ్వెత్తున ఉప్పొంగే అలలతో
ఎగిరి దుంకుతున్న
విశాలమైన నల్ల సముద్రాన్ని
నేను!

భయానకమైన
చీకటి రాత్రులని దాటుకుంటూ
లేస్తాన్నేను!
అద్భుతంగా తళుక్కుమనే

ఒక కొంగ్రొత్త సూర్యోదయం లోకి
లేస్తాన్నేను!

బానిస
ఆశనూ
స్వప్నాన్నీ నేను!

నా పూర్వీకులిచ్చిన
అపురూపమైన బహుమతులని
వెంట తెచ్చుకుంటూ
నేను లేస్తాను!
లేస్తాన్నేను!

## పొయట్రీ ఇన్ మోషన్

- రవికిరణ్ తిమ్మిరెడ్డి

నిన్ననో మొన్ననో సరిగ్గా జ్ఞాపకం లేదు
పరుగాపి వెనక్కు చూస్తే ఎదురుగా
కనిపించీ కనిపించని గీతం
వినిపించీ వినిపించని గానం
అలుపువలసేవో ఎగిరెగిరి పడుతున్న పదాలు
చమటలా కారిపోతున్న శబ్దం నిశ్శబ్దంగా
అలసిన బిడ్డని చూసినట్లనిపించి, అయ్యో అనిపించి
ఎందుకు తల్లీ ఈ చలిలో పరుగు
హీటెడ్ సబ్ వే కార్లో చక్కటి మెరిసే ఫ్రేంలో
కడుపులో చల్ల కదలకుండా కూర్చోక, ఎక్కడకీ పరుగు?
వినిపించీ వినిపించని నిశ్వాసం
ఎక్కడో ప్రాణం పోసుకుంటున్న నిశ్శబ్దం
అమావాశ్య రాత్రుళ్ళు కూలే అలల మెరిసే అంచుల్లాగా
కొండనుకోస్తూ గాలిపాడే గీతం
గ్రాండ్ సెంట్రల్ స్టేషన్లో ప్రతిధ్వనించే ట్రంపెట్ సంగీతం
మాటకీ మౌనానికి మధ్య
గానానికీ గీతానికీ మధ్య
మనిషికీ మనసుకీ మధ్య
గమ్యానికీ గమ్యానికీ మధ్య
పొయట్రీ ఇన్ మోషన్ **

** Each year the MTA and the Poetry Society select poems and post them on New York City's subways and buses. You can visit MTA's Poetry in Motion web page at

http://www.mta.info/mta/pim/index.html

## చెట్టు-బాలుడు

- ఇంద్రాణి పాలపర్తి

ఇల జారిన పువ్వులతో
అల చేరిన గువ్వలతో
కలల కాయలు కాచిందీ చెట్టు.
ఒక చేత్తో బోదెను తడుతూ
ఒక చేత్తో గాలిని నెడుతూ
చుడుతున్నాడు వాడు
దీనిని పదే పదే
కలలు రాలుతాయేమోనని.
చిట్టి పాదాలు మట్టి వలయాలని సృష్టిస్తున్నాయి
కొన్ని పువ్వులు రాలి వాడి జుత్తులో ఇరుక్కున్నాయి.

## స్పృహ

- ఎల్యెన్

కళ్ళే కాదు,
కలాలూ కలలు కంటాయ్.
నెగళ్ళే కాదు,
బయళ్ళూ జ్వలిస్తాయ్.
మల్లెలే కాదు,
మెదళ్ళూ వికసిస్తాయ్.
మెదళ్ళూ వికసిస్తాయ్,
పిడికిళ్ళకు
అటూ ఇటూ నిలుస్తాయ్.

## కత్తి అంచు రాత్రికి వీరుడి వాగ్దానం

- రాజు

వెరవని ధీరుడెవరో
వేకువనే వెళిపోతాడు
ఇది పశ్చాత్తాపాలు కూడని కాలం కదా
కత్తి అంచు రాత్రి మీద
గద్గద స్వరాల నిరసన
ప్రకటింపబడుతుంది
ఘడియలు రక్తసిక్తమై
రాతికళ్ళ చూపులై వేచి చూస్తాయి
తెలవారుఝాము ఫజర్
వాడు లేకుండానే
వీధుల ముట్టడిస్తుంది
ఇది విలపిత సందర్భాల నిషేధ కాలం
రక్తగత గుణమైన రణసందేశ కాలం

***

ఆకలెవరికి వేస్తుంది
మనుషుల ఆకలి
ఒక్క తెల్లవాడికే కాక
ఇంకెవరికేస్తుంది
కొలంబస్ నావ
కోటి కాంతులకు ఉరిపెట్టిందట
ఇది కాళ్ళు వేళ్ళాడబడ్డ
కఠినతరువు
కాళ్ళకింది నేల స్పర్శను ప్రాణరహితం
చేసిన
నాలుగు శతాబ్దాల నరమేధం
ఇపుడిక
కంఠంలో మౌనాన్ని మోయడమెందుకు

ఇదంతా

స్వరఖడ్గపు రణరంగం

ఉత్తిరించబడ్డవన్నీ

ఎగిసిపడి రవరవలాడే ఋతువుల కాలం

***

వొట్టితాడు విషపాతకమౌతుందా

భూమండలాన్నే ఉరికోత పెడుతుందా

కన్నీరు తిన్నెలపై రాలిన క్షణాన

ఎడారి కంట్లో కత్తులు పూస్తాయి కావచ్చు

ఈ తాడుపైనేకాదు

మనం ప్రేమింపబడ్డ వాటన్నిటిపైనా

ద్వేషం రగులుతుంది కావచ్చు

నేల ఎరుపెక్కి

మనవైన వాటన్నిటినీ బూడిద చేస్తుంది

ఎడారి ఎర్రబడి

తుఫానై ఉప్పెనై

భూగోళాన్ని

ఊపిరి సలపని ఇసుక గుప్పిట్లో

బంధిస్తుంది

***

ఏ సుమేరియన్ ఎద్దు

అమాయకపు కనుల

బాధామయ దృక్కులు పూసుకున్న ప్రేమబంధమో

ఆ ప్రాతఃకాలానికి

పూసిన పసిమొగ్గలన్నీ

కన్నీరు రాల్చాయి

నివాళిగా

కొన్ని విచ్చుకొన్నాయి

మనదంతా తెగని ప్రేమల కాలం
తెంచుకోబడని ప్రేమమయ కాలాల బంధం
మనదంతా
పాషాణ హృదయాల మీద
ఛీత్కారపు చూపులు సారించిన కాలం
మనమంతా
ఓడిపోయిన కాలాన
బరిమీద నిలబడ్డ వాళ్ళం

***

ఎడారి నీరులేనిదే గానీ
కన్నీరు లేనిది కాదుగదా
అది తన కళ్ళ దీపాలతో
నేలనంతా వెలిగిస్తుంది
కడుపుమంటతో ప్రపంచాన్ని నడిపిస్తుంది
వెరవని ధీరుడు వెళ్ళిపోయిన తరువాయి
ఎడారి దుఃఖాన్ని అదిమిపట్టి
దూసే కళ్ళని ఏరుకుంటుంది
సైకత తీరాన గుజ్జనగూళ్ళు
మమతకు ఆలంబన
బాబిలోనియన్ నాగరికతా అగ్ని సదస్సున
పూసిన అద్భుత పుష్పం
తూరుపుమెడ సింగారించిన
ఇసుక బంగారం
సద్దాం!

## బలిపశువు

- బి.అజయ్ ప్రసాద్

అది కొన్ని పల్లెటూళ్ళను జాతీయ రహదారికి కలుపుతూ పోయే కాలిబాట. దారికిరువైపులా ఎండకు ఎండి నేలకు అణిగిపోయిన గడ్డి. అక్కడక్కడా ఒంగిచూస్తున్న ఈత చెట్లు. విసిరేసినట్లున్న పొదలు.

కాలిబాటమీద కొమ్ములూపుకుంటూ గేదె ఒకటి నడుస్తూ ఉంది. దాని రెండుకొమ్ముల మధ్య నుదిటిమీద తెల్లటి పొడవాటి మచ్చ - అది మచ్చ బర్రె.

మచ్చబర్రె వెనుక కాలిబాట మీద పది పన్నేండ్ల పిల్లవాడొకడు ముల్లుకర్రను చేత్తోపట్టుకుని మధ్యమధ్యలో మచ్చబర్రెని అదిలిస్తూ దానివెనకే నడుస్తున్నాడు. అతడి పేరు నాగమల్లి.

పిల్లవాడి వెనుకే పదడుగుల దూరంలో అతడి తండ్రి యలమంద ఎండవేడికి చెమటలు కక్కుతూ టైరుచెప్పులతో భారంగా అడుగులేస్తున్నాడు. కిర్రుచెప్పులు చేసే శబ్దానికి తోడు అతడి చేతికర్ర నేలమీద చేసే చప్పుడు లయబద్ధంగా ఉంది. అతని భుజాన ఉన్న కర్రకి భార్య ఉదయాన్నే కట్టిచ్చిన అన్నం మూట వేలాడుతూ వీపుకు తగులుతూ ఉంది.

సూర్యుడు నడినెత్తికి రాకముందే మిట్టమధ్యాన్నపుటెండకి కాలిబాటకిరువైపులా చెట్లు ఉసూరుమంటున్నాయి.

"ఇప్పటివరకు సగం దూరమన్నా వచ్చుంటాం. ఇంకా నాలుగైదు మైళ్ళన్నా నడవాలి" కళ్ళకి చేతులడ్డం పెట్టుకుని ఆకాశం వంక కళ్ళు చికిలించి చూశాడు యలమంద.

తండ్రీకొడుకులు పొద్దున్నే తెల్లవారకముందు చీకట్లోనే సంతనూతలపాడు గొడ్లసంతకని ప్రయాణం కట్టారు. తమ ఊరినుంచి ఎనిమిది మైళ్ళు నడక. చూస్తుండగానే సూర్యుడు నిప్పులు చెరుగుతూ పైకి లేస్తున్నాడు. పరగడుపున మొదలయిన నడక పగలు పదయ్యేంతవరకు కూడా ఆగలేదు.

ఉదయం నుంచి అదేపనిగా నడిచిన అలసటచేత నాగమల్లి "నాయనా ఇంక ఆగుదామా ఆకలేస్తుంది" - అన్నాడు వెనక్కితిరిగి తండ్రివంక మళ్ళి చూస్తూ.

"అప్పుడేనారా" అని యలమంద విసుక్కున్నాడు.

నెత్తిన కణకణ మండుతున్న ఎండకు అతనికీ ఎక్కడన్నా ఆగుదామని ఉంది. ఆగితే మరింత ఆలిస్యం అవుతుందని అతని భయం. నడవాల్సింది ఇంకా చాలా దూరముంది. ఆలోచిస్తూ చివరికి రావిచెట్టుకాడ ఆగుదాంలేరా అని నిదానంగా అడుగు ముందుకేశాడు.

నాగమల్లి ముందుకు మళ్ళీ కర్రతో మచ్చబర్రెను అదిలించాడు. అతడి కళ్ళకు మైలు దూరంలో వడగాలికి ఆకులు కొట్టుకుంటున్న రావిచెట్టు కనిపించింది. మచ్చబర్రె గునగున అడుగులేస్తూ ముందుకుసాగింది.

కాలిబాటవెంట నడుస్తుంటే దారికిరువైపులా కందిచేలు అప్పుడప్పుడూ వీచేగాలితో తలాడిస్తున్నాయి. అక్కడక్కడ చెట్లపొదలమీద వాలిన పిట్టలు మనుషుల అలికిడికి గాలిలో లేచి అటూ ఇటూ ఎగురుతా ఉన్నాయి. అడుగులు ముందుకు సాగుతున్న కొద్దీ యలమంద ఆలోచన వెనకకు వెళ్ళసాగింది. కంది చేల నుంచి వీస్తున్న గాలి పాతకాలం పుండుని సలుపుతూ ఉంది.

పదేళ్ళక్రితం ఎక్కడ ఉండేవాడు తను. ఈ కంది తనూ పండించాడు. చేతికింద ఐదెకరాలు. మాగాణి మాటకాదు. ఉన్నదంతా మెట్టే. మొదట్లో వరిగెలు, జొన్నలు, సజ్జలు వేసేవాడు. రోజులు గడిచే కొద్దీ వ్యాపార పంటలు వచ్చాయి. రైతులందరూ పత్తి పొగాకు మీద పడ్డారు. తను కంది వేసిన రోజులలోనే కోమటి కాంతయ్య ఊళ్ళో మిల్లు పెట్టాడు. మొదట్లో తామంతా నెల్లూరుకో ఒంగోలుకో వెళ్ళి అమ్ముకునే వాళ్ళు. ఊళ్ళో పండిన కందులకు కాంతయ్య కొరకరాని రేటు పెట్టాడు. బయటికెళ్తే దారిఖర్చులు అదనంగా పెట్టుకోవాలి. కాంతయ్య రైతుల పరిస్థితి కనిపెట్టి బయటిరేటుకంటే కొద్దిగా తక్కువ ధర పెట్టాడు. అమ్ముకుంటే అడివి కొనుక్కుంటే కొరివి. అదేమి విచిత్రమోగాని మార్కెట్లో కందిపప్పు రేటు పెరుగుతానే ఉంది కాని కంది రైతులకు కనీస ధర లేదు.

వేసిన కంది ఖర్చులకి కూడా రాలేదు. విత్తనాలు, కూలి రేట్లు పోను మిగులు చూసుకుంటే కాంతయ్యకొచ్చిన లాభమే ఎక్కువ. చేసినదంతా కష్టం. మిగిలిందిమాత్రం నష్టం. కాంతయ్యది కాయకష్టం లేని లాభం. కూర్చుని చేసే వ్యాపారం. యలమందకు మొదటిసారి వ్యాపారం అంటే ఏమిటో మొదటిసారి తెలిసివచ్చింది. అది వ్యాపారం కాదు - బ్రోకరుపని అని అసహ్యించుకున్నాడు. చూడగా చూడగా లోకంలో రిక్షా తొక్కేవాడిదగ్గిర నుంచి కాఫిహొటలు నడుపుకునేవాడి వరకూ దళారులుగానే కనిపించారు. ఒకరిమీద ఒకరు ఆధారపడే మనుషులు. మనుషులను ఒకచోటనుంచి మరొకచోటకి తరలించడానికీ మనుషులు. సరుకు చేతులు మారేకొద్దీ మనుషుల చేతుల్లో మిగులు.

అందరూ సరకు ఉత్పత్తిచేసేవాళ్ళుగా ఉండటం కూడా యలమందకు అసంభవంగా కనిపించింది. రోజురోజుకీ జనం ఒకరికి ఇద్దరవుతా ఉన్నారు. కంటికి కనపించే జనంలొ ముప్పాతిక భాగం పైగా సరుకునో మనుషులనో ఒకచోటనుంచి మరొక చోటకి తరలించే బతుకుతెరువులో ఉన్నారు. సరుకు చేతులు మారుతున్న వ్యాపారంలో

ఎవరి లాభం వారికుంది. సరుకుని సృష్టించే తనబోటివాడే తెలియని చిక్కుముడిలో ఇరుక్కుని అడుక్కిపోతా ఉన్నాడు.

కంటికి తాచుపాము కనిపించడంతో యలమంద నడక ఆపి నుంచుండిపోయాడు. పాము కాలిబాట కుడివైపునుంచి ఎడమవైపుకు నాగజెముడు పొదలోకి జరజరపాకుతా ఉంది. దానికవతల నాగమల్లి, మచ్చబర్రె పర్లాంగు దూరంలో పోతా ఉన్నారు.

తాచుపాము పొదలోకి వెళ్ళేవరకు యలమందయ్య దానిని చూస్తూ నుంచున్నాడు. అతని నడకతో పాటు ఆలోచన కూడా ఆగిపోయింది. పాము పొదలోకి పోయాక నడకతోపాటు అతని నీడ కూడ ముందుకు ముందుకు కదిలింది.

అప్పుడేమైంది తనకి.. అవును.. చేసే కష్టం ఒక కూటికీ ఒక కార్యానికీ రాలేదు. ఒకపక్క పెళ్ళీడుకొచ్చిన కూతురు. తను అడుక్కి జరగడం అప్పుడే మొదలయింది. కూతురు పెళ్ళికోసమని రెండు ఎకరాలు అమ్మేశాడు. అల్లుడు సేద్యగాడు కాదు. లారీలమీద పని. కూతురు పెళ్ళైతే అయిందిగాని పెళ్ళైన రెండేళ్ళకే అల్లుడు క్షయరోగంతో మంచాన పడ్డాడు. ముందు మదనపల్లె తీసుకుని వెళ్ళారు. తరువాత ముదిరిపోయింది మద్రాసు తీసుకెళ్ళమన్నారు. అక్కడ రెండు లక్షలవుద్దన్నారు. రోగం నయం కావడానికి అప్పుచేశారు. యలమంద కూడా తనవంతుగా తెలిసినవాళ్ళదగ్గిర పాతికవేలు అప్పుచేసి కూతురు చేతిలో పోశాడు. తను అప్పు చేయడం అదే మొదటిసారి.

రావిచెట్టు ఆకుల గలగల చప్పుడుతో యలమంద ఆలోచననుంచి బయటపడ్డాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న నాగమల్లి చెట్టు నీడలో ఒకపక్కన మచ్చబర్రెను సగం నరికిన తుమ్మమొద్దుకు కట్టేసి కొడవలితో అక్కడక్కడ కాస్త పచ్చగడ్డికోసి దాని మూతిదగ్గిర పడేశాడు.

తండ్రీకొడుకులు ఉన్న నీళ్ళతోనే మొకాలు, చేతులు కడుక్కుని రావిచెట్టుకింద కూర్చుని అన్నంగుడ్డ విప్పారు. ఎర్రటి పండుమిరపకాయ పచ్చడి మెతుకులు.. నాగమల్లి ఆవురావురమని తినడం మొదలెట్టాడు. యలమంద నాలుగు మెతుకులు తిన్నాననిపించి చేతులు కడుక్కుని నీడగా అనిపించడంతో చెట్టుకింద కండువా పరుచుకుని నడుం వాల్చాడు. ఎండవేడికి చెట్టుకొమ్మమీద వాలిన కాకి నోరుతెరుచుకుని చూస్తూ ఉంది.

వాళ్ళకి రెండు మూడు మైళ్ళ దూరాన చేలమధ్య తలకు గుడ్డ చుట్టుకుని చేతిలో కర్రపట్టుకున్న ఒక పొడుగాటి మనిషి చేనుగట్టుమీద వడివడిగా నడుస్తూ వస్తున్నాడు. అతడు చాలసేపటిక్రితమే వీళ్ళను దూరం నుంచి చూసి వెనకే వస్తున్నాడు.

నాగమల్లి అన్నం తిని ఈత చెట్టొకటి ఎక్కి పసుపురంగులో ఉన్న ఈతకాయలను తెంపుకుని తువ్వాలులో వేసుకుంటున్నాడు. ఈత చెట్టుకు కాస్తదూరంలో ఉన్న తుమ్మ కొయ్యకు కట్టిన మచ్చబర్రె నీడకు కూర్చుని పచ్చిగడ్డి నెమరేస్తూ ఉంది. రెండుమూడు పిచ్చుకలు పచ్చడిమెతుకులకోసం నేలమీద వాలాయి. పడుకున్న యలమంద కంటికెదురుగా పత్తిచేను కనుచూపుమేర పరుచుకుని ఉంది. అతని ఆలోచన పలువిధాలుగా ఉంది.

కాయని చించుకుని వస్తున్న తెల్లటి పత్తి అతడికళ్ళకు మసకమసకగా కనిపించింది. దానిని చూస్తుంటే పత్తిమీద తను చేసిన కష్టం తన పెట్టుబడిగా పెట్టిన అప్పులు గుర్తొచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగి తెల్లటి పత్తికాయలు నల్లబడి మరింత మసకబారాయి.

అవునుమరి... కందికత అలా ఉంటే పత్తికత ఇంకోలా ఉంది. గింజలు, కూలిరేట్లకంటే దీంట్లో మందుల ఖర్చెక్కువ. ఎక్కడెక్కడివో ఇంగ్లీషు మందుల పేర్లు తమ జీవితాల్లోకి వచ్చాయి. ముందు ఆకుమడత తరువాత పేనుబంక. తరువాత్ తెల్లదోమ వచ్చింది. తెల్లదోమ తెల్లదయ్యంలా అతడిని రాత్రింబగళ్ళు నిద్రపోనివ్వలేదు.

పురుగులని దోమలని తప్పించుకుని బయటికొచ్చేసరికి తలప్రాణం తోక్కొచ్చింది. అంతా అయ్యాక పత్తిబేళ్ళను బళ్ళమీదేసుకుని గుంటూరు పెళ్ళారు. తీరా అక్కడికిదాక పెళ్ళాక పత్తి కొనే కంపెనీవాళ్ళు మాకఖ్ఖర్లేదన్నారు. అదేమని బతిమిలాడితే తక్కువ రకం అన్నారు. కొనేవాడు ఒక్కడైతే అమ్మేవాళ్ళు పదిమంది. తమకు ముందు అర్థం కాలేదు కాని - వాడికి కావలసింది తక్కువలో ఎక్కువ. దానికోసం ఆడాల్సిన నాటకాలన్నీ ఆడారు. తరువాత తొక్కిసలాట, పోలీసులు..లాఠీ దెబ్బలు...

చివరికి ఒక ఆసామి కల్పించుకుని తమపత్తిని ఆయన కొంటానన్నాడు. ముందు మగానుబావుడనుకున్నారు. తరువాత తెలిసింది వాడూ వాళ్ళూ ఒకటేనని. అయినకాడికమ్ముకుని ఉసురోమంటూ ఊరు చేరారు. ఒక్క తమ పొరుగింటి చంద్రయ్య తప్ప. చంద్రయ్య గుంటూరు లాడ్జిలోనే పురుగుమందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు.

పచ్చడిమెతుకులను తింటున్న పిచ్చికలమధ్య పైనున్న కాకి వచ్చి వాలడంతో పిచ్చికలు చెల్లాచెదురై దూరం జరిగాయి. కాకి ఒకపక్క పిచ్చికలని బెదిరిస్తానే ఒకపక్క మెతుకులను బొక్కుతూ ఉంది.

పత్తి కొట్టినదెబ్బకు తమ ఊరి పత్తిరైతులు పత్తాలేకుండా పోయారు. దాంట్లో ధరలు నిర్ణయించేది దళారీలు, సిండికేట్లే. పత్తిగింజలమ్మేదీ వాళ్ళే - పండించిన పత్తినీ కొనేది వాళ్ళే. ఎక్కడ చూసినా పండించినోడికంటే పనిలేనోడి పనే బాగుంది.

ఈ పది సంవత్సరాల కాలంలో ఎక్కడ మిగిలేడు తను. కాలం గడిచేకొద్దీ భూమి తగ్గుతా ఉంది. గిట్టుబాటులేని సేద్యంలో కాస్తన్నా మిగుల్చుకుందిలేదు. తనకూ ఇంకో ఆదాయం లేదు. అప్పులు తీర్చింది లేదు. చూస్తుండగానే ఉన్న భూమంతా కక్కుకూ కళ్యాణానికీ కరిగిపోయి అరెకరం మిగిలింది. ఏదీలేదనిపించకుండా సుబాగులేసి నాలుగు బర్రెలతో నెట్టుకొస్తున్నాడు.

చెట్టుకింద పడుకున్న మనిషి మీద నుంచి నీడ ఎప్పుడు పక్కకి జరిగిందో తెలియదు. సూర్యుడి కిరణాలు కళ్ళలోకి సర్రున గుచ్చుకోవడంతో యలమంద గభాల్న లేచి కూర్చున్నాడు. పడమటికి కాస్త వంగిన సూర్యుడిని చూడగానే అతడికి వేళకు గొడ్లసంతకు చేరగలనో లేదో అని కంగారు పుట్టింది. మూడుగంటలకన్నా సంతకు చేరకుంటే బేరం కుదరడం కష్టం. చీకటి పడ్డాక కొనేవాళ్ళుండరూ, ఇంటికి వచ్చేది కూడా కష్టమని అతనికి తెలుసు. కొడుకుని కేకేసి పిలిచి దబదబ గేద కట్టుతాడు విప్పాడు.

ఈత చెట్టు దగ్గిర నోట్లో పచ్చీతకాయలేసుకుని నములుతున్న నాగమల్లి లేచి పరిగెత్తుకుంటూ వచ్చి ముల్లుకర్ర తీసుకుని హెయ్ హెయ్ అని మచ్చబర్రెని అదిలించాడు. తండ్రీకొడుకులు మళ్ళీ నడక మొదలెట్టారు. వాళ్ళముందు మచ్చబర్రె కొమ్ములూపుకుంటూ నడవసాగింది.

నిజానికి క్రితం రోజు వరకు యలమందకు గేదను అమ్మాలనే ఆలోచన లేదు. అంతకుముందు రెండురోజులక్రితం కొడుకు చదువుకి అవసరం ఉంది అప్పుచెల్లించమని వచ్చాడు శివయ్య. ఎప్పటిదనగా అప్పు. ఐదు సంవత్సరాలక్రితం అల్లుడి రోగం నయం కావడానికి కూతురికిచ్చిన పాతిక వేలలో పదివేలు శివయ్య ఇచ్చినవే. వడ్డీ లేని అప్పు. అడగగానే కాదనకుండా ఇచ్చాడు శివయ్య - అవసరం అందరికీ ఉంటుందంటూ. ఈరోజుల్లో అవసరానికి ఆదుకునేదెవరు? అందులో వడ్డీలేని అప్పెవరిస్తారు. ఇచ్చినోడు మళ్ళీ ఐదేళ్ళవరకు అడగలేదు.

అప్పు చెల్లలేదు కాని అల్లుడు రొగమొచ్చి చచ్చిపోయాడు. ఇప్పుడు కొడుకు చదువుకోసమని శివయ్య అడిగాడు. అప్పు చెల్లించడానికి రెండురోజులు గడువడిగాడు యలమంద.

గడువైతే అడిగాడుకాని ఎక్కడ నుంచి తేవాలో పాలుపోలేదు. చేతిలో అరెకరం నాలుగు బర్లు తప్ప ఇంకేమీ లేదు. చేసేదేం లేక ఉన్న నాలుగిటిలోనే ఒక బర్రెనమ్ముదామని బయలుదేరాడు.

''కరువురోజుల్లో పాలిచ్చే తల్లినమ్ముకుంటావా?'' అని సణిగింది భార్య.

''నాయం నాయమే. శివుడు మన అవసరానికి అడగగానే అప్పిచ్చాడు. అప్పుతీసుకున్నా అల్లుడు బతకలేదని, చచ్చిన శవం మీద బాకీ వసూలు చేయడం బాగోదని వాడిన్నాళ్ళూ అడగలేదు. ఇప్పుడు మనం వాడి అవసరం తీర్చకుంటే అన్నేయం కాదా'' - అన్నాడు యలమంద.

‘‘మనకేదేవుడు నాయం చేశాడని’’ గొణుక్కుందామె తనలోతనే.

చీకటితోనే కొడుకుని లేపి మచ్చబర్రెనిప్పి సంతమాగులూరు గొడ్ల సంతకు బయలుదేరాడు. తెల్లవారుజామున బయలుదేరితే ఇప్పటివరకు నడుస్తూనే ఉన్నారు.

డొంకరోడ్డు మీద దబదబ అడుగులేస్తూ నడుస్తున్న యలమందకి కందిచేను గట్టుమీద అరకిలోమీటరు దూరంలో తలపాగా మనిషి కనిపించాడు. అతడు చాలా సేపటి క్రితమే తండ్రికొడుకులను చూసి గాలిలో సైగలు చేస్తూ పిలుస్తున్నాడు.

అతడు నడిచి వస్తున్న చేనుగట్టు డొంకరోడ్డు కలిసే చోట సీమచింత చెట్టు గుబురేసి ఉంది. తలకట్టు మనిషి వచ్చేవరకు యలమందయ్య సీమచింత చెట్టు దగ్గిర నడక ఆపి నుంచున్నాడు. దానికితోడు అక్కడ అతనికి కాస్తంత చల్లగా అనిపించింది. నాగమల్లి మచ్చబర్రెను నిలిపి చెట్టుమీద ఎర్రటి సీమచింతకాయలకోసం తలెత్తి చూడసాగాడు.

తలకట్టు మనిషి వస్తూనే గొడ్ల సంతకేనా సామి? - అనడిగాడు. చాలా దూరం పొలం గట్టువెంట మట్టిపెళ్ళలమీద నడిచిరావడం వల్ల ఆయాసపడుతూ ఉన్నాడు. విపరీతమైన ఎండ చేత అతని శరీరం చెమటలు కక్కుతూ ఉంది.

అతడు చూడటానికి పొడవుగా బక్కపలచగా ఉన్నాడు. అతని చేతికర్ర కూడా అతనిలాగే సన్నగా పొడవుగా ఉంది.

యలమందయ్య అతడిని ఆయాసం తీర్చుకోనిచ్చి ‘‘అవును బాబయ్యా. గొడ్లసంతకనే బయలెల్లినాం’’ అన్నాడు.

తలకట్టు మనిషి యలమందను ఎగాదిగా చూశాడు. తరువాత మచ్చబర్రెకేసి చూశాడు. అతడి కళ్ళు మనిషినీ పశువునీ లెక్కకడుతున్నాయి.

‘‘ఇంతకీ తమదే ఊరో’’ అన్నాడు యలమంద అతడిని నిశితంగా చూస్తూ.

‘‘నాపేరు బజారయ్య సావి. మాపటేళకు నేనూ అటొచ్చే పనుంది - ఇదేనా సంత పశువు అంటూ మచ్చబర్రెను పరిశీలించి చూస్తూ అన్నాడు.

అతడు తన ఊరు పేరు చెప్పలేదు.

నాగమల్లి పొడవాటి కర్రనొకదానిని తీసుకుని సీమచింతగుబురులో జొనిపి లాగుతున్నాడు. అతడి పొడవుకు కాయలు అందడం లేదు. అతడి గురి ఒకవైపుకు ఉంటే చేతులు మరొకవైపుకు కదులుతున్నాయి.

“ఇది పడ్డలాగుంది - పాలిచ్చే గేదలా లేదు. ఎన్నీతలైంది సామి?”

“ఇప్పటికి రెండీతలయ్యాయి. రెండో ఈత దూడ బతకలేదు - గాశారం బాగలేక గేదనమ్ముకుంటున్నాను నాయినా. పెంచిపెద్ద చేసిన పశువు. నాకాడ పాలిచ్చే గేదల్లో ఇదే మెరుగు. మూగజీవాలతో స్నేహితం చేసేమనిషేగాని అమ్ముకునే మనిషిని కాను”.

“ఇంతకీ తమదేవూరు సావి?” యలమంద మళ్ళీ అడిగాడు.

“ఎంత చెప్దామనుకుంటున్నావేంది” - తనదే ఊరో చెప్పకుండా మళ్ళీ దాటవేశాడు బజారయ్య.

“పన్నెండు వేలు - రేయ్ మల్లిగా... నడవరొరోయ్...” యలమంద కొడుకుని కేకేశాడు. అతనికది కుదిరే బేరం లా అనిపించలేదు.

నాగమల్లి కర్రవతలకిసిరేసి మచ్చబర్రెని “హయ్ హయ్...” అని అదిలించి ముందుకి కదిలాడు.

బజారయ్య నమ్మలేనట్లు మొహం పెట్టి వాళ్ళతో నడక సాగించాడు.

ముగ్గురు నలుగురయ్యారు. వారి నడక కనుచూపుమేరలో కనిపిస్తున్న తార్రోడ్డువంక సాగిపోతా ఉంది. వాళ్ళు రోడ్డుని సమీపించేకొద్ది అప్పుడప్ప సాగే వాహనాల రణగొణుల రొద వారి చెవులను చేరుతూ ఉంది.

“ఇంకో బేరంలేదా సామి” అన్నాడు బజారయ్య యలమందతోపాటు అడుగులేస్తూ.

“అంతకి తక్కువైతే ఉన్నూళ్ళోనే కసాయోడికమ్ముకొందును.” కళ్ళకి తార్రోడ్డు కనిపించేసరికి యలమంద నడకవేగం పెరుగుతూ ఉంది.

వాళ్ళు తారురోడ్డు చేరుకున్నాక బజారయ్య పనుందంటూ ఆగిపోయాడు. నలుగురు ముగ్గురయ్యారు.

యలమంద గొడ్లసంతకు చేరేసరికి నాలుగయింది. సంతంతా వచ్చిపోయే మనుషులతో పశువులతో కోలాహలంగా ఉంది.ఎటు చూసినా గేదెలు, ఆవులు - వాటిని ఆనుకుని చూస్తున్న దూడలు.

నాగమల్లి మచ్చబర్రెని కట్టుకొయ్యకు కట్టేసి అక్కడే ఉన్న బండరాయిమీద కూర్చుని సంతని వింతగా చూస్తున్నాడు. అతను అక్కడికి రావటం అదే మొదటిసారి.

కొందరు బేరగాళ్ళు అక్కడికక్కడే బేరాలు కుదుర్చుకుంటున్నారు. అక్కడికక్కడే సొమ్ములు చేతులు మారుతున్నాయి. అక్కడికక్కడే పశువులు చేతులు మారుతున్నాయి.

అమ్ముడుపోయిన పశువులు ఎక్కడికి వచ్చామో తెలియక ఎక్కడికి పోతున్నామో తెలియక అంబా.. అని కలవరపడుతున్నాయి.

వారందరి మధ్య బిడ్డలకు దూరమవుతున్న తల్లులు. తల్లులకు దూరమవుతున్న బిడ్డలు.

అమ్ముడుపోని పశువులు అమాయకంగా పచ్చగడ్డి నెమరేస్తూ కూర్చున్నాయి. యలమంద కాస్త పచ్చగడ్డి తెచ్చి మచ్చ బర్రెకు పడేసి వచ్చిపోయే జనాన్ని చూస్తూ కూర్చున్నాడు.

ఒకరిద్దరు బేరగాళ్ళు మచ్చబర్రెని చూస్తూ సంతలోకిపోయారు.

వీళ్ళు చూస్తానికే వచ్చారు కాబోలు అని యలమంద అనుకుంటుండగానే డొంకరోడ్డులో కనపడిన బజారయ్య తన పొడవాటి కర్రూపుకుంటూ సరాసరి లోపలికి వచ్చాడు. వచ్చిన వాడు అది తనకు చాలా పరిచిత ప్రదేశంలా లోపలికి అడుగుపెట్టాడు. వస్తూనే తెలిసిన వాళ్ళని నలుగురైదుగురిని పలుకరించాడు.

కొత్తవారు అతడిని వింతగా చూస్తే కొందరు బెదిరిన గొడ్లమాదిరి చూశారు. లోపలికి పోయినవాడు కొంతసేపటికి యలమంద దగ్గిరకు వచ్చాడు.

"ఏంది పెదనాయన... ఇంకా బేరం చేసినట్లు లేదే" అన్నాడు ఎగాదిగా గేదెను చూస్తూ.

"లేదు సావి దానికోసరమే చూస్తున్నాను" అన్నాడు యలమంద పచ్చగడ్డి మచ్చ బర్రె నోటికందిస్తూ.

"ఇట్టాగయితే నువ్వు గేదని కోన్నోడికీ రావు - అమ్మేవాడివీ కాదు" అన్నాడు బజారయ్య.

నాగమల్లి బెదరిన దూడవలె చూశాడు.

"నేనింకా ఎవురికి రేటు చెప్పనేలేదు" అన్నాడు యలమంద ఎటో చూస్తూ.

"బక్కబర్రె... ఆరువేలకు బేరమైతేగొప్పే పెదనాయనా" అంటూ యలమంద సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయాడు బజారయ్య.

వచ్చినవాళ్ళు ఒకరిద్దరు మచ్చబర్రె ముందు ముట్టె పట్టుకుని ఎనక ఎదను చూసి పోతే మరొకాయన "ఎన్ని సేర్లిస్తది చిన్నాయినా" అనడిగాడు.

యలమంద ఎన్నిసేర్లిస్తదో చెప్పాడు.

‘‘కట్టు దూడ లేదేమో’’

‘‘లేదు నాయనా తిత్తిదూడే’’

అతగాడు ఓ...అలాగా... అంటూ వెళ్ళిపోయాడు.

‘‘మందుగుద్ది పాలుపిండే మాయగాళ్ళే ఈళ్ళకు పనికొస్తారు. నాలాగ నిజం చెప్పినోడు ఇక్కడ అసమొర్దుడే’’ అనుకున్నాడు యలమందయ్య నుదిటిమీద చెమట తుడుచుకుంటూ.

పొద్దు గుంకుతా ఉంది. మళ్ళొచ్చే బేరగాళ్ళెవరూ తిరిగి రాలేదు. యలమందయ్యకు ఆశ సన్నగిల్లుతా ఉంది.

చూస్తా ఉంటే లోపలికి దూరిన బజారయ్య మళ్ళి వచ్చాడు.

‘‘ఏంది పెదనాయిన ఇయ్యాల ఇంటికెళ్ళేదుందా లేదా’’

‘‘ఏది బేరం రాందే’’

‘‘చెప్పినాను కదా...ఇది పడ్డలాగుంది.. పాలిచ్చే గేదలా లేదు’’

‘‘సిన్నప్పటినుండి గేదల్లో తిరిగినోడిని సావి. ఆటి సంగతి నాకు బాగ తెలుసు. పెంచుకున్న బర్రె కసాయోనికొకరకంగా కనిపిస్తది పెంచుకున్నోనికొక రకంగా అగపడతది. సెప్పినాను గదా..నేను సావాసం సేసినోడినేగాని కటికోడినిగాను.’’

‘‘కావలిస్తే ఇంకో ఐదొందలుంచుకో’’

‘‘నామీద దయ తలచొద్దు సావి’’

పిల్లవాడు ఆత్రుతగా చూస్తున్నాడు.

‘‘సరే ఏడువేలు. ఇంకేం మాట్టాడకు ఇదే ఆఖరు బేరం.- నీ యిష్టం మరి.’’

అనుకున్నదానికంటే అయిదువేలు తక్కువ. శివయ్యకు ఇంకా మూడు వేలు తేవాలి. మళ్ళి అప్పు - యలమంద ఆలోచన.

బజారయ్యకి యలమంద ఒప్పుకున్నదీ లేనిదీ అర్థం కాలేదు. అతడికి యలమంద అంతరంగం అర్థమయ్యే అవకాశం లేదు.

ఏం పెదనాయినా మాటాడవు.

యలమంద చివరికి ఇక సరే అన్నట్లు తలూపాడు. నాగమల్లి దబదబా పాలుపిండి బజారయ్య చేతికిచ్చాడు.

పైకం చేతులు మారింది. బర్రె కట్టు తాడు చేతులు మారింది.

తాడు చేతులు మారగానే మచ్చబర్రె కొమ్ములు విదిలించింది. బజారయ్య మచ్చబర్రెని కట్టుకొయ్యకే కట్టి సంతలోకి నడిచాడు.

యలమంద కాగితపు నోట్లని లెక్కచూసి తగరపుకాగితంలో చుట్టుకుని లోపలి జేబులో కుక్కుకుని బయటకు నడిచాడు.

ఇద్దరూ ఊరుదాటి తాము నడిచిన డొంకదారి మెయిన్ రోడ్డు దగ్గిర కలిసేచోట నుంచున్నారు.

చీమకుర్తివైపు వెళ్ళే ఒకటి రెండు లారిలు వారి పిలుపును పట్టించుకోకుండా రయ్యిమని వెళ్ళిపోయాయి. ఇంకేమైనా బళ్ళు వస్తాయేమోనని తండ్రి కొడుకులు రోడ్డంట చూస్తూ నిలబడ్డారు. వారికి దూరంగా ఒక మనిషి బర్రెనొకదానిని తోలుకుంటూ రోడ్డుమీద వాళ్ళవైపే రావడం కనిపించింది.

కొద్దిసేపయిన తరువాత నాగమల్లి బర్రెని చూస్తూ ''నాయనా అది మన మచ్చబర్రే'' అన్నాడు.

గేదెను తోలుకు వచ్చే మనిషి వాళ్ళను సమీపిస్తున్నంతలో లారి ఒకటి యలమంద ముందు వచ్చి ఆగింది. క్లీనరు తల బయటకు పెట్టి ఎవూరెళ్ళాలి అనడిగాడు''

నాగమల్లి తాము వెళ్ళవలసిన ఊరు చెప్పి ఎక్కి కూర్చున్నాడు.

యలమంద లారి ఎక్కబోతూ ఒక్కనిముషం ఆగి బర్రెని తోలే మనిషిని ''ఏమి సామి ఎంతపడ్డది'' అని గట్టిగా అవతలి వ్యక్తికి వినపడేటట్లు అడిగాడు.

ఒకపక్క లారి క్లీనరు తొందర పెడుతున్నాడు. లారి వెనుక రెండు మూడు లారీలు ఆగి ఒకటే సైరన్ కొడుతున్నాయి.

అవతలి మనిషి ''పన్నెండు వేలు'' అని మచ్చ బర్రెను అదిలిస్తూ డొంకదారి పట్టాడు.
మచ్చ బర్రె యలమందను గుర్తుపట్టి మెడగింజుకోసాగింది. యలమందకు మనసూ అలాగే...

## చష్మా

- షఫీ

మాసిన చొక్కా. చొక్కా గల్ల నుంచి మేఘంలా మెరుస్తున్న దేహం. ఎత్తు... ఎత్తుకు తగ్గలావు. అరేబియన్ ఇసుక ఎడారిలా ఎర్రని ఒంటి చాయ.

'అరబ్బు నవాబులా ఉనాడు పిలకాయ. కారు కందెన పూసుకొని కార్ల కింద పొర్లాడాల్సినోడు కాదని షెడ్డులో పని చేయించుకోడానికి వచ్చేవాళ్లు చెప్పే మాటలు మళ్లీ ఎంటాడేవి. అరబ్బు దేశాలు కలల్లో కలవరపెట్టేవి'.

'బూమ్మా! పిలకాయ రాజౌతాడు. పెద్ద చెవులున్నోల్లు దేశాల్నేతారని వీధిలోకొచ్చే సుద్దరోల్లామె చెప్పిందని అమ్మ ఎప్పుడూ చెప్తూ ఉండేది. ఇక మామలు గోర్బచేవ్... గోర్బచేవ్ అని రష్యా అధ్యక్షుడితో పోల్చేవాల్లు. చాన్నాల్లదాక గోర్బచేవ్ అంటే ఎవరో తెలిసేదికాదు. నన్ను పట్టిస్తున్నారని అలిగి దూరంగ ఎల్లిపోయేవాన్ని'.

రిపేరు చేద్దామని కారు కింద దూరి ఏకంగ నవాబు కలల్లో విహరిస్తున్న వాడు చేతికేదో కరెంటు షాకనిపించడంతో ఒక్కసారిగా భూమ్మీదికిచ్చేశాడు. షెడ్డులో ఒంటరిగా ఉన్నప్పుడు పనిలోపనిగా ఇలా పగటికలల్లో మునగడం షరీఫ్‌కు మామూలే. మొన్నటిదాక రేష్మా ఊహల్లో ప్రేమదేశంలో విహరించిన మనసు ఇప్పుడు అరబ్బు దేశాల్ని కలవరిస్తాంది.

ప్రొద్దుటూరుకు ఒకవైపు మెకానిక్ షెడ్లతో 'జబ్బార్ షెడ్లు' ఉన్నాయి. జబ్బార్ షెడ్లలో చాలావరకు అంగల్లన్నీ ముస్లింలవే. అందుకేనేమో ఈ ఏరియాను జబ్బార్ షెడ్లు అంటారు. ప్రతి షెడ్డులోనూ మాసిన గుడ్డలతో, చేతులకూ ముఖానికి కందెన పూసుకొని ఒక్క ముస్లిం పిలకాయైన ఉంటాడు. ఈ ఊరి ముస్లిం పిలకాయల జీవితం టీ అంగల్లోనో, మెకానిక్ షెడ్డుల్లోనో, పూలమార్కెట్టుల్లోనో వికసిస్తాంది. వీరిలో ఎలిమెంటరీ స్కూల్లోనే చదువుకు సలాం చెప్పిన వాళ్ళూ ఉన్నారు. పల్లెల్నుంచి వచ్చి ఇలా పనిలో చేరిన వాళ్ళూ ఉన్నారు.

పల్లె నుంచి ప్రొద్దుటూరుకు వలస వచ్చిన కుటుంబాల్లో షరీఫ్ తల్లిదండ్రులదీ ఒకటి. బామర్దులు సౌదీకెల్లి అద్దాల మేడలు కట్టారని, తన పిల్లలూ సౌదీకెలితే తామూ సుఖంగా బతకొచ్చనే ధీమాతో మమ్మదు పల్లెటూరు నుండి ప్రొద్దుటూరుకు మకాం మర్చాడు.

ముగ్గురు పిల్లల్నీ తలా ఒక పనిలో చేర్పించాడు. ముగ్గుర్లో పెద్దోడు షరీఫ్. పది పాసై ఎమ్మే.. గిమ్మే దాకా చదవాలని ఎంతో కోరిక. పట్నం వచ్చింతర్వాత తన కోరిక తీర్తుందని అనుకున్నోడు ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు.

ఆ ఆదివారం శాశ్వతంగా తన చదువుకు ఎగనామమౌతుందని ఎప్పుడూహించనేలేదు.

ఎప్పటిలా ఆదివారం సాయంకాలం టివీలో సినిమా చూడ్డానికి పక్క వీధిలోనే ఉండే చాచీ వాళ్ల ఇంటికి తమ్ముల్లతో ఎల్లాడు షరీఫ్. నాన్న ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉండాలనే రూలులాంటి భయం పిల్లల్నెప్పుడూ ఎన్నాడుతుండేది. సినిమా అయిపోయింతర్వాత భయంభయంగానే ముగ్గురూ ఇళ్లు చేరారు. నాన్న ఇంట్లో లేకపోవడంతో సినిమా చూసిన తృప్తి మిగిలిందన్పించింది. మమ్మదు రావడంతో అందరూ భోజనాలు ముగించారు.

పొద్దున స్కూలుకెల్లాలి కదా! ఓసారి పుస్తకాలు తిరిగేద్దామని కూర్చున్నాడు షరీఫ్.

''అరే! షరీఫ్'' నాన్న పిలవడంతో పుస్తకం పక్కన పెట్టి ''క్యాబా'' సందేహిస్తూ ఎల్లాడు షరీఫ్.

''బేటా! సమాసే షెక్‌షా మామూకే షెడ్ కో జానా. కామ్ సికా బోల్కే బోలుం. జాకే మెకానిక్ కామ్ సిక్లే.''

'హా...జాతుం అనాల్నో, నై...పడ్లేతుం' అని నాన్న మాటకు ఎదురు చెప్పాల్నో తెలియని స్థితి షరీఫ్‌ది. ''బా'' ఇక మాట పెగల్లేదు.

''అజీ! ఏసాల్ హొజానెదో. క్యా ఉత్నీ జల్దీ'' మధ్యలో తల్లి ఖాతూన్.

''అరే! జల్దీకి బాత్‌నై. ఆజ్ ఖాశీం మిలా. ఏ మహినా ఆఖర్‌మే ఫిర్ సౌదీకో జాతాకతే. బడేకో మెకానిక్‌కామ్ సికా బోల్యా. మై జానేకేబాద్ ఇజా భేజ్తుమ్ బోల్యా.''

ఆ మాట చెప్తూ తనకు ఒక సౌదీ బామర్ది ఉన్నందుకు ఒకింత గర్వం ప్రదర్శిస్తున్నట్లు మమ్మదు కళ్లు పైపైకి ఎగిసాయి.

బామర్దుల్ని ఎప్పుడూ తనకంటే తక్కువగా భావించే మమ్మదు, ఇజా పంపిస్తానని చెప్పడంతో భార్య ముందు ఖాశీం దౌలత్‌ను పొగడకుండా ఉండలేక పోయాడు.

''తూ దేఖ్తీ హైనా! చార్‌సాల్ పహ్లే తెరా భాయ్ కైసాథా. బాఖయ్ కర్కే సౌదీ గయా. ఆజ్‌దేఖ్ కిత్నా బడా మహెల్ భన్యా.''

అట్టా సౌదీకల పెంకుల్లో నుంచి జాలువారిన వెన్నెల్లా ఆ ఇంట్లో ప్రసరించింది. షరీఫ్ చదువు అమావాస్య చీకట్లు కమ్ముకొని మెకానిక్ షెడ్లో చెరాడు.

బంధువుల్లో, వీధిలో సౌదీ వెళ్లొచ్చిన వాళ్లు అరబు ఎడారి అందాల్ని చెప్తుంటే ఆ ఎడారుల్లో ఒయాసిస్సుల్ని (చష్మా) అందుకోవాలనే కోరిక షరీఫ్‌లో బలపడేది. వెన్నెల్లో మెరుస్తున్న ఎడారిలా కందెన మరకల్తో రెండేళ్లుగా మెరిసి మురిసి పోతున్నాడు.

* * *

షెడ్డులో రిపేరు ముగించుకొని కారు యజమాని కోసం ఎదురుచూస్తున్నాడు షరీఫ్.
సాయంకాలం నీరెండ నల్లని కారు అద్దాలపై పడి ప్రతిబింబిస్తాంది. షెడ్డుల్లో పనిచేసే పిలకాయల్లాగే కందెన్ని పూసుకొని, రాసుకొని నేల సైతం నల్లగా ఉంది.

ఢబీ.. ఢబీ

టకా... టకా శబ్దాలతో

పని సరిగా చేయలేదని ఉస్తాదు చేతిలో స్పానరు ఎక్కడో కాళ్లకో, చేతులకో తగిలి మూలుగుతున్న బాల్యంతో

వస్తూ పోతున్న బండ్ల పొగతో

షెడ్ల మధ్యలో తడికెలతో కట్టుకున్న మసీదు నుంచి ఐదుపూటలా ఇనబడే అజాతో... జబ్బార్ షెడ్ల వాతావరణం ఊరికి ఒకవైపు వెలసిన సెట్టింగు వాడలా ఉంది.

ఈ రోజు రంజాన్ నెలవంక కనబడ్డది. రేపట్నుంచి రోజాలు మొదలౌతాయి.

రంజాన్ మాసానికి సన్నద్ధమౌతున్నట్లు.. వంగిన మసీదు తడికెలకు పోట్లు వచ్చాయి. మసీదు ఆవరణలో ఉజూ చేసుకోడానికి కొత్తగా నాలుగు మట్టికుండలు నీళ్లతో నిండినాయి.

షరీఫ్ ఉస్తాదు కూడా రంజాన్ మాసం తయారీలో ఉన్నాడు. మధ్యాన్నం ఇంటికెలుతూ, సాయంకాలం నుండి అంగడి బంద్ చేస్కోని ఇంటికెళ్లమన్నాడు.

ఈరోజుతో తన ప్రేమ వయసు సంవత్సరం నిండుతాది. నెలవంకను చూసి రేష్మా ముఖాన్ని చూడాలి... మనసులో ఆ ఊహ మెదలగానే షరీఫ్ ముఖం నిండు చంద్రునిలా ఎంతగా ఎలిగిపోయిందో.

* * *

మమ్మదు కుటుంబం లాగానే నజీరు కుటుంబం ఒనిపెంట నుంచి ప్రొద్దుటూరుకు వలసొచ్చింది. నజీరు సౌదీకెళ్లి సంపాయించిన డబ్బులతో మమ్మదు ఇంటికి ఎదురుగా ఒక ఇల్లు కొని స్థిరపడ్డాడు.

భర్త మళ్లీ సౌదీకెల్లడంతో నజీర్ భార్య గౌసియా తన ఇద్దరు పిల్లల్తో ఉంటాంది. పాప పేరు రేష్మా. మసీదు ఎనకున్న ఉర్దూ బడిలో తొమ్మిద్దాక చదివించి ఆడపిల్లకు చదువెందుకు, అమ్మకు తోడుండమని ఇంట్లో కూచోబెట్టి సౌదీకెళ్లాడు నజీర్. చిన్నవాడు జావేద్ ప్రైవేటు స్కూల్లో ఎనిమిది చదువుతున్నాడు.

అరబ్బు దేశాల్లో రంజాన్ ఎలాగుంటాదో ఎవరైనా చెప్తే ఇనిందేకాని, ఖాదర్ హుసేన్ మసీదు వీధుల్లోలాగానే ఉంటుందనిపించేది షరీఫ్‌కు.

ఆరోజు రంజాన్ నెలపొడుపు కోసం అందరం మిద్దెలెక్కి ఎదురుచూస్తున్నారు. ఎదురింటి మిద్దెమీద గౌసియా మామి, పక్కన రేష్మా నిలబడి ఉన్నారు. వీధిలో ఇరుగూ పొరుగూ వారిని మాము, మామీ అని పిల్వడం పిలకాయలకు అలవాటు.

తలమీద దొనీ కప్పకొన్న రేష్మా ముఖం సాయంకాలం బంగారు కాంతిలో పసుపూ ఎరుపూ మిలిత వర్ణంలో ఎలిగిపోతాంది.

అప్పడే మసక మబ్బుల బుగ్గలపై ఎవరో సుతారంగా చిటికెనేలితో వంకర గీసినట్లు రంజాన్ నెలవంక. గాలి వాటుకు దొనీ చెదిర్తే ముసుగు చాటు రేష్మా బుగ్గలాగుంది.

రోజురోజుకూ పెరుగుతున్న నెలవంకలా షరీఫ్ మనసులో ఎన్నీ తెలియని మార్పులు. రేష్మాను మళ్లీ మళ్లీ చూడాలని, తజ్బీ స్మరించినట్లు రేష్మా పేరును తన పెదాలకే ఇనబడేలా ఉచ్చరించడం...

అలా తెలియని భావంతో కళ్లు కలపడంతో ప్రారంభమై మాటలు కలపడం దాకా వచ్చింది. ఇఫ్తార్‌కు పలహారం ఇవ్వడానికి వచ్చిన రేష్మాను పలకరించడం.. ఒక్కోక్కప్పడు ఇఫ్తార్ సమయమవగానే రేష్మా కోసం దర్వాజాలో ఎదురు చూడ్డంతో రంజాన్ మాసం ముగిసింది.

ఈద్ రోజు ఉస్తాద్ మాము ఇచ్చిన నూర్రూపాయల్తో రేష్మాకి ఏమి కానుక ఇవ్వాలా? అని తెగ ఆలోచించి, చేతికి గాజులు, ఇష్టమైన జడకు కుచ్చులు తీసుకొచ్చాడు షరీఫ్.

పండగ నమాజు తర్వాత అమ్మను, బాబాను కలిసి ఈద్ ముబారక్ చెప్పడానికి రేష్మా, షరీఫ్ ఇంటికి రానే వచ్చింది. ఒక చేతిలో సేమియా గిన్నే, మరో చేత్తో తలమీద దొనీ సర్దుకుంటూ ఇంట్లో అడుగుపెడ్తున్న రేష్మా చిన్నప్పడు బుడినానీ చెప్పిన కథల్లోని పరీలా అన్పించింది షరీఫ్ కళ్లకు.

దర్వాజాలో అడుగు పెట్టగానే ''అస్సలాము ఆలైకుమ్'' అని అందర్నీ ఒకేసారి పలకరించింది, ఈద్ ముబారక్ చెప్తూ ఖాతూన్ కాళ్లు మొక్కడానికి వంగింది రేష్మా.

''అరే బేటా! ఏ క్యా కర్తేహొ ! పావ్ పడ్నా నై'' అంటూ రేష్మా భుజాలు పట్టుకొని లేపి తన గుండెలకు హత్తుకొని ''అల్లా తుఝె బడీ ఉమర్ దే!'' అంటూ దీవించింది ఖాతూన్.

రేష్మాను చాప మీద కూచోబెట్టి సేమ్యాలు తీస్కరావడానికి పొయ్యి కాడికెల్లింది ఖాతూన్.

దర్వాజాకు పాత పరదా ఏలాడ్తాంది. ఉతికి కట్టినట్టున్నారు. గాలి దూరడానికన్నట్టు పరదాకు చిన్న చిన్న కిటికీల్లా చిల్లులు పడున్నాయి. పొగ పట్టిన గోడలు సున్నం పూసినా ఇక మెరవలేమన్నట్టు మెరుస్తున్నయి. పొయ్యి సెగకు మాడిపోయినట్లున్న పెంకుల్లో నుంచి అరవై క్యాండిల్ల బల్బు ఏలాడ్తాంది. కరెంటు బిల్లు మోగుతాదేమోనని ముప్పై క్యాండిల్ల ఎలుగుతో మూల్గుతాంది.

ఖురాన్, హదీస్, గ్యారా మంజాలీస్ ఇంకా ఏవో ఉర్దూ పుస్తకాలున్న గూటికి పరదా కట్టి ఉంది. గూటికి అటూ ఇటూ రెండు పటాలు. ఒకదాంట్లో ఖురాన్ ముందు దువా చేస్తున్న పిలకాయ, ఇంకోదాంట్లో రెక్కలొచ్చిన గుర్రం దేహంతో స్త్రీ ఫోటో ఉంది.

''మీఠా లే బేటీ!'' అని రేష్మా చేతికి సేమ్యా గిన్నె అందించి, ఇనామ్ ఇవ్వడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేనందుకు ఆలోచిస్తాంది ఖాతూన్.

'పూచేంగె బోలేతో ఘర్‌మే ఉనోబి నహీ. ఖాకె బాహర్ నికల్ గయాః. ఈద్‌కే దిన్ బచ్చోఃకో దేనేకో పైసే దేవ్ బోలేతో సునే... సునేనినాద్ ఘర్‌సే చలే గయాః.'' అని తన అసహాయతకు బాధపడ్తూ... ''బేటా! షరీఫ్ హివ్వా'' అని కొడుకును పిలిచి ''ఉస్తాద్ దియేసో పైసే క్యాతో హాతో దే బేటా'' చేతులు పిసుక్కుంటా అడిగింది.

నూర్రూపాయల్లో అరవై రూపాయలు మిగిల్తే పది తన జేబులో ఏస్కొని ఐదు పదికాయితాలు అమ్మ చేతిలో పెట్టాడు షరీఫ్.

తెల్లని పంజబీ డ్రస్సులో కుప్పపోసిన ఎన్నెల్లా ఉన్న రేష్మా పక్కగా కూర్చొని ''ఏ బార్ పైసే నహీ బోల్కే అమ్మీకో సాడీ, ముఝె, చోటేకో ఏక్ ఏక్ జోడా కప్డే భేజీ'' నాన్న సౌదీ నుండి తనకు డ్రస్సు పంపినందుకు సంబరపడ్తూ చెప్పింది రేష్మా.

మూడు నెల్లగా అరబు డబ్బులివ్వకపోవడంతో దోస్తుల దగ్గర అప్పు చేసి పండక్కి భార్యా బిడ్డలకు తలా ఒక జత బట్టలు పంపించాడు నజీర్.

దూరపు కొండలు నునుపని తెలిసినా సౌదీ కెల్లకుండ ఉండలేని స్థితి. అరకొర చదువులు. నేర్చుకున్న పనితో సొంతంగా అంగల్లు పెట్టుకోవాలన్నా, వ్యాపారం చేసుకోవాలన్నా పెట్టుబడి కావాలి. పెట్టుబడి పెట్టినా ఇప్పటికే పాత్కొనిపోయిన వాళ్లతో పోటీపడి నెగ్గుకరాగలమనే ధీమా ఉండదు.

తెలివున్నోడు నీళ్లని ఏటాడ్తా పొలాల్ని ఆక్రమిస్తుంటే ముస్లింలు ఎడారుల్లో బతుకునెతుక్కుంటారు. ఆ వెదుకులాటలో భార్యాబిడ్డల్నొదిలి, అప్పో సప్పో చేసో ఉన్న గూటినే తాకట్టు పెట్టో దినార్‌ను తగ్దీర్‌తో ఢీకొడ్తున్నారు.

రూపాయి ఇయ్యలేని ధీమా ఎడారిలో ఒయాసిస్సులా దినార్లో కనబడ్తాంది.

వచ్చి చాలాసేపు కావడంతో ''అమ్మీ దేక్తీ హౌఁ'' అంటూ లేవబోయింది రేష్మా.

''లే బేటీ తేరా ఇనామ్'' తన చేతిలోని ఒక పదికాయితం రేష్మా చేతిలో పెట్టి ''తేరే మామూ అభీ బాహర్ గయీ'' అని తన పరదాచాటు అశక్తతను చెప్పుకుంది ఖాతూన్.

'తను తెచ్చిన తోఫా రేష్మాకు ఎలా ఇయ్యాలి?' షరీఫ్ మనసు కొట్టుకుంటూంది.

'అమ్మీ కానీ మామీ కానీ చూస్తే? ఒకేల తను తీసుకుంటుందో లేదో?' షరీఫ్ మనసును గుచ్చుతున్నట్టు ఎన్నో ప్రశ్నలు.

ప్రేమ ఆపాటి ధైర్యం ఇస్తాది కదా! ఆ ధైర్యంతోనే రేష్మాకంటే ముందుగా ఇంట్లో నుంచి వచ్చి దర్వాజాలో నిలబడ్డాడు షరీఫ్.

ఇంట్లోంచి తిరిగివస్తున్న రేష్మాతో ''ఈద్ ముబారక్'' అని చేయి అలానే పట్టుకొని, తన ప్యాంటు జేబులో నుంచి ప్యాకెట్ తీసి రేష్మా చేతిలో పెట్టాడు షరీఫ్.

''క్యాహై యే?'' తీసుకోడానికి సందేహించింది రేష్మా.

'దిల్ హై! ప్యార్‌కా తోఫా హై!' అంటూ నాలుక్కర్చుకొని, ''ఇనాం హై'' స్వీకరించమని కళ్లతో ప్రాధేయపూర్వకంగా చూసాడు షరీఫ్.

సిగ్గుతో వాలిన కళ్లతో తేలిక మందహాసం ఎదజల్లుతూ ప్యాకెట్‌ను దొనీలో దాచుకొని గబగబా గేటుతీసుకొని ఎల్లిపోయింది రేష్మా.

మర్నాడు షెడ్డుకెళ్తూ మదిలో ఏదో ఊహించుకొని ఎదురింటి గేటు ముందర సైకిల్ గంట కొట్టాడు షరీఫ్. ఊహించినట్టే తనిచ్చిన గాజులు, జడకుచ్చులతో గేటుదాకొచ్చి నిలబడింది రేష్మా. ఆరోజు మొదలు షెడ్డుకు పోతూ, ఇంటికొస్తూ గంట కొట్టడం, రేష్మాను దర్శించుకోవడం రోజువారీ రివాజుగా మారింది.

* * *

మళ్లీ రంజాన్ మాసం వచ్చింది.

పాస్పోర్టు, ఇజా రెడీగున్నాయి. పండగ అయిపోంగనే సౌదీకెళ్లాలి. షరీఫ్ సౌదీకెల్తున్నాడన్న విషయం తెల్సినప్పట్నుండి నిండు పౌర్ణమిలా నవ్వుల ఎన్నెల్ని కుర్పించిన రేష్మా ముఖం ఒక్కసారిగా తేజోరహితంగా మారిపోయింది.

రేష్మా అంగీకారం కోసం ఎన్నో విధాలుగా ప్రయత్నించి చూసాడు షరీఫ్.

రేష్మా అమ్మ పక్కింటికో లేదా ఆసార్ వీధిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి ఎళ్లినప్పుడు, ఏ వారానికో పదిరోజులకో ఫోను అవకాశం కూడా ఇప్పుడు రేష్మా అలకలకు, షరీఫ్ బుజ్జగింపులకే సరిపోతాంది.

''ముఝే ఛోడ్కే జానేకో…ముఝే ఛోడ్కే జానేకో'' అని ఈరోజు మధ్యానం ఫోను చేసి ఎంతగా ఏడ్చింది రేష్మా.

''అరే! కా జాతాహూ… దోసాల్ హీనా… సబర్ కరో!'' షరీఫ్ ఓదార్పు. రేష్మాను వదిలెల్లాలంటే తనకూ బాధగానే ఉంది.

'నా ఆశలన్నీ రేష్మానే. నా వర్తమానం, భవిష్యత్తూ అన్నీ నా చాంద్కా తుక్డా… రేష్మానే. కానీ సౌదీకెల్తున్నది రేష్మాను శాస్వతంగా తనదాన్ని చేసుకోడం కోసమే కదా'.

ఒకటి రెండేళ్లుండి సంపాయించుకొని తన కాళ్లమీద తను నిలబడ్తే పెళ్లికి రేష్మా వాళ్లింట్లోనూ అభ్యంతరం చెప్పరని షరీఫ్ ధీమా.

రేష్మాను ఎంతగా ప్రేమించాడు! రేష్మాను పొందాలంటే సౌదీనీ అంతే ప్రేమించాడు.

తనకూ ఒక ఇల్లు కావాలి. పెంకుటిల్లు కాస్తా సౌదీ దయవల్ల స్లాబుమిద్దె ఏస్కోవాలని షరీఫ్ కోరిక.

అరబ్బు డబ్బులే లేకుంటే ఖాదర్ హుసేన్ మసీదు వీధులన్నీ ఎప్పటిలా బోదకొట్టాల్తోనే ఉండేవి.

''హా… దోసాల్! దోసాల్మే కుచ్ఛీ హెూసక్తా!'' ఈవత్తల్నుండి రేష్మా ధిక్కారం.

ప్రేమంటే టీవీలో వచ్చే సీరియల్లు, సినిమాల్లో చూడడమే. కానీ జీవితానుభవంలోకి వచ్చేసరికి రేష్మాలో తెగింపునిచ్చింది. నాలుగ్గోడల మధ్య పరదాచాటు కలలు కాస్తా ఇప్పుడు ప్రేమలోకంలో స్వేచ్ఛగా విహరించాలనుంది.

అవును ప్రేమ... ఒక సుందర స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛ అవతలి మనిషి ప్రేమకు లోబడి ఉంటుందన్న విషయం రేష్మాకు ఈ జనంకు తెలిసే ఆస్కారం లేదు.

అంత అలకలోనూ ''అజీ... అజీ ఏక్‌బాత్. ఆజ్ రంజాన్‌కా చాంద్ దిఖేగా. షెడ్‌సే జల్దీ ఆనా'' అని ఫోను పెట్టేస్తూ రేష్మా చెప్పిన మాట షరీఫ్‌ను నిలువనియ్యడం లేదు. ఇంటికెళ్లాలని, రేష్మా ముఖంలో నెలవంకను చూడాలని మనసు తొందరపెడ్తాంది.

తడికెల మసీదు నుండి మగ్రీబ్ అజా ఇనబడ్తాంది.

అంతలోనే కారు ఎజమాని సుబ్బారెడ్డి తమ షెడ్డు వైపుగా వస్తూ కనబడ్డాడు. అది చూసిన షరీఫ్ పాత గుడ్డతో కారు అద్దాలపై పేరుకున్న దుమ్మును తుడుస్తూ వచ్చిన సుబ్బారెడ్డితో ''వైరింగంతా చెడిపోయిందన్నా. ఈసారికి పనిజరుగుతాది. కాలిపోయిన బల్బులూ మార్చినా. మొత్తం నూటయాభై ఐందన్నా'' అని రిపేరు ఖర్చులు చెప్పాడు.

''ఏందబ్బీ అంత ఇవరాలు చెప్పాల్నా. ఇంతైందంటే కాదంటనా,'' అంటూ కూలితో కలిపి రెండు వంద కాయితాలు చేతికందించాడు సుబ్బారెడ్డి.

సుబ్బారెడ్డి కారు తీస్కపోవడంతో సామాన్లన్నీ సర్ది, షెడ్డుకు తాళమేసి తనూ సైకిల్‌పై ఇంటికి బయల్దేరాడు.

షరీఫ్ సైకిల్ ఖాదర్ హుసేన్ మసీదు వీధిలోకొచ్చేసరికి పిలకాయలంతా హుషారుగా కేరింతలేస్తూ కనబడ్డారు. వీధిలో అందరి ముఖాలు రంజాన్ నెలవంకను చూసిన ఆనందంతో ఎలిగిపోతన్నాయి. ఖాదర్ హుసేన్ మసీదు డెకరేషన్ లైట్లతో నక్షత్రాల్ని పొదివినట్లు మెరిసిపోతాంది.

ఇంటి కాడికి రావడంతోటే షరీఫ్ చూపులు ఎదురింటి గేటువైపు ఆశగా చూసాయి. నెలవంకను చూసి మిద్దెపై నుండి వస్తున్న రేష్మా ముఖం నీరుడి నెల్లవంకలా లేదు. విషాదంపై కప్పిన పరదలా ఓ నవ్వు నవ్వి ఇంట్లోకెళ్లిపోయింది రేష్మా.

నెలవంక నిండు చంద్రునిలా విచ్చుకుంటుంటే రంజాన్ మాసం గడుస్తున్నకొద్దీ రేష్మా ముఖం కుంచించుకుపోతాంది.

అయ్యిందన్నట్లుగా ఈసారి రంజాన్ పండగ గడిచింది.

ఆరోజు రానే వచ్చింది.

రాత్రి పదిగంటలకు యర్రగుంట్ల నుంచి ముంబాయికి రైల్లో పోయి, ఆన్నుంచి సౌదీకి ఇమానంలో ఎల్లాల్సి ఉంటాది.

పొద్దున్నుంచి ఇళ్లంతా సందడి సందడిగా ఉంది. బంధువులూ, వీధిలో వాళ్లు సౌదీలో ఉన్న తమ పిల్లల్ని కలవమని చెప్పి, పిల్లలకు తంగేడుపల్లి మిఠాయి, జాబులూ ఇచ్చిపోతన్నారు.

ఖాతూన్‌కు కొడుకు సౌదీకెల్లి లెక్క సంపాయించుకొస్తాడని ఓవైపు ఆనందంగా ఉన్నా, కొడుకును అంతదూరం పంపిస్తున్నందుకు తల్లిప్రేమ కల్లలో నీటిపొరల్ని కమ్మేస్తాంది.

ఎనిమిది గంటలైంది. ఇషా నమాజుకోసం మసీదు నుంచి అజా ఇనబడ్తాంది.

బట్టలూ, తనక్కావల్సిన సామాన్లన్నీ ఒక బ్యాగులో సర్దుకొని, రైల్లో తినడాంకని అమ్మ చేసిన చపాతీలు ఒక ప్లాస్టిక్ కవర్లో పెట్టుకున్నాడు షరీఫ్.

ఏవో జ్ఞాపకాల్ని ఎతుక్కుంటూ ఇళ్లంతా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఇంట్లో తనకు సంబంధించిన ప్రతి వస్తువునూ తడిమి తడిమి చూస్కుంటున్నాడు.

ఎదురింట్లోని టేప్‌రికార్డు నుంచి ఏదో హిందీ పాట తేలికగా వినబడ్తాంది. ఆషాభోంస్లే అనుకుంటూ ప్రియుడికోసం విరహంతో పాడుతున్న పాట. తనను సంబోధిస్తూ రేష్మా పాడుతున్నట్లుగానే ఉంది. గుండె బరువెక్కినట్లుగా ఉండి నేల జారిపోతుందా అన్పించింది షరీఫ్‌కు.

భారంగా నడుస్తూ తల్లి కాడికెల్లి పాదాల్ని మొక్కాడు షరీఫ్. ఉబికొస్తున్న కన్నీళ్లను అదిమిపట్టి కొడుకును గుండెలకు హత్తుకొని ''హిమ్మత్‌సే హెూ బేటా. జానేకే బాద్ ఫోన్ కర్. ఖత్తా దాల్తాహెూ'' అని ధైర్యం చెప్పింది ఖాతూన్.

ఇద్దరు తమ్ముళ్లనూ చెరో సంకలోకి తీస్కోని కౌగిలించుకున్నాడు. తండ్రి తోడురాగా, బ్యాగు భుజానికేస్కోని పెద్ద తమ్ముడితో రైలెక్కడానికి యర్రగుంట్లకు బయల్దేరాడు షరీఫ్.

* * *

సౌదీలో ఇమానం దిగేసరికి ఏర్‌పోర్టులో ఖాశీం వచ్చి ఉన్నాడు. టాక్సీ మాట్లాడి షరీఫ్‌ను తీస్కొని అరబ్ ఇంటికి బయల్దేరాడు ఖాశీం.

విశాలమైన రోడ్లు, పలచని జనం, జనవరిలోనే మండుతున్న ఎండల్తో సౌదీ అద్భుతంగా ఆశ్చర్యంగా అన్పించింది షరీఫ్‌కు.

చివరకు టాక్సీ ఒక పెద్ద బంగ్లా ముందు ఆగింది. ఆ బంగ్లా పక్కగా విశాలమైన రేకుల షెడ్డు. ఆవరణలో రెండు పెద్ద పెద్ద కార్లున్నాయి.

షరీఫ్ బ్యాగుల్ని షెడ్డులో ఒక వారగా ఉన్న చిన్న రూములో పెట్టిరమ్మన్నాడు ఖాశీం. తర్వాత ఇద్దరూ అరబ్బును కలవడానికి బంగ్లాలోకెల్లారు.

ఆఫీసులాంటి ఒక రూములో యాభై ఏళ్ల బలసిన శరీరంతో పైనుంచి కింది దాకా తెల్లనిదుస్తుల్లో కూచోనున్నాడు అరబు. ఇద్దరూ అరబ్బుకు సలాం చేసి లోనికి ప్రవేశించారు.

షరీఫ్ ఇజాను అరబ్బుకు చూపించి ఏదో అరబీలో మాట్లాడాడు ఖాశీం.

అరబ్బులతో ఎలా మసలుకోవాలో, ఏ ఏ పనులు చేయాలో చెప్పి, ఏమైనా అవుసరముంటే తనకు ఫోను చేస్తుండమని సెల్ నెంబరిచ్చి షరీఫ్ ను షెడ్డులో ఉన్న రూములో వదిలి ఎల్లిపోయాడు ఖాశీం.

మెకానిక్ పనికోసమని వచ్చిన షరీఫ్ కు ఎడారిలో ఖర్జూర తోటమాలిలాగా ఉండాల్సివచ్చింది. నేను వచ్చిన పని ఇదికాదు అని అరబ్బును ప్రశ్నించలేని నిస్సహాయత షరీఫ్ ది.

ఇండ్లు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులతో సౌదీకు రావడంతో 'పని ఏదైతేనేమి లెక్కిస్తే సరి' అని రాజీపడ్డాడు.

షరీఫ్ పడ్తున్న ఎడారి కష్టాల్ని చూసి సానుభూతి చూపడం తప్ప ఖాశీం కూడా ఏమీ చేయలేకపోయాడు.

నెలంతా ఖర్జూర తోటను చూసుకుంటా నెల చివర్న రూముకొచ్చేవాడు. నెలజీతం తీస్కొని ఇంటికి పంపించడం, మిగుల్చుకున్న దానితో ఇంటికీ రేష్మాకూ ఫోను చేస్తుండేవాడు షరీఫ్.

ఇట్లా సంవత్సరం తీరిపోయింది. బాకీ ఇంకా తిరనేలేదు.

నెలజీతం తీస్కొని రేష్మాకు ఫోను చేసాడు షరీఫ్. ఆ వైపు నుంచి మగ గొంతు ఇనబడింది. నజీరు మామ సౌదీ నుంచి వచ్చినట్లున్నాడు. ఏమి మాట్లాడాలో తెలియక ఫోను పెట్టేసాడు.

కాసేపాగి మళ్లీ ఫోన్ చేసాడు. మళ్లీ అదే గొంతు... రేష్మా ఫోనెత్తకపోవడంతో నిరాశగా... ''మామూ! మై సామ్నే ఘర్వాలోంకా బచ్చా షరీఫ్. అమ్మీకో బులావో బాత్కర్నా '' అన్నాడు.

షరీఫ్ ఫోను చేసాడని గౌసియా పిలవడంతో కొడుకుతో మాట్లాడ్డానికి పరుగున వచ్చింది ఖాతూన్. ఫోన్ తిస్కోగానే ''సలాం అలైకుమ్ అమ్మీ '' నీరసంగా ఇనబడింది షరీఫ్ గొంతు.

'' క్యా బేటా అచ్చీత్రా హైనా?'' కొడుకు గొంతులో తచ్చాడిన విషాదజీరను ఒడిసిపట్టిన తల్లి హృదయం.

'' బా ఔర్ బచ్చే కైసే హై మా'' ఏదో అడగాలని మరేదో పలికిన షరీఫ్ గొంతు.

'' హమే నోబ్ అచ్చీత్రా హై బేటా! ఏ సాల్ హెూతో ఘర్కే పైసే మిర్జాతీ. తూ క్యా హైవత్ ఖానేకో'' ఖాతూన్ ఓదార్పు.

కొడుకును ఇక ఇంటికొచ్చేయమని చెప్పాలనుంది ఖాతూన్ కు. కానీ ఇంటి తాకట్టు గుర్తు రావడంతో ఒక్కసారిగా కళ్లు చెమ్మగిల్లాయి. 'అప్పుచేసి బిడ్డను పంపానా?... బిడ్డను పంపి అప్పు చేసానా తెలీడం లేదు. బిడ్డ కష్టమంతా అప్పు బూడ్చనీకే సరిపాయ. సౌదీ... సౌదంటూ కలవరిస్తుంటారు. దినార్ తగ్దీర్కీ భూక్ మితాతాకీ నైకీ మాలూమ్ నై. మాకే పేట్కీ తడప్కో కెత్నే ఆసువోసే సంభాలూ '

...............

...............

ఖాతూన్ ఇంకేమీ మాట్లాడకపోవడంతో, ''అమ్మీ మై హతుం, ఖుదాహాఫీజ్'' అని ఫోను పెట్టేస్తూ ''గౌసియా మామీకో, రేష్మాకో, గల్లీవాలోంకో మేరా సలాం సునావో'' తల్లితో చెప్పాడు షరీఫ్.

తల్లి నుంచి ఊహించని సమాధానం. ''బేటా తుఝే మాలూంనైనా, రేష్మాకి షాదీ హెూగయీ. సాస్కే ఘర్ జాకో హై''.

తను ఏమి విన్నాడో షరీఫ్ కు అర్థంకాలేదు. ఆలోచనలు గడ్డకట్టుకపోయాయి. నోట మాట పెగల్లేదు. కనుచూపు మేరా అంతా ఎడారే... ఎడారి. ఈ ఎడారిలో చెమ్మలు కనబడ్డం కాదు, తన హృదయంలో చెమ్మసైతం కనబడ్డంల్యా.

ఇప్పుడు దేహమే అణువణువూ రేణుపై ఇసుక కుప్పలా ఉంది.

ఇతర ఆలోచనల్లాగే భక్తి పారవశ్యమూ, మతపరమైన ఆధ్యాత్మిక భావాలూ కూడా మెదడులోని కొన్ని భాగాలలో జరిగే చర్యల వల్లనే కలుగుతాయని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. అటువంటి నమ్మకాలేవీ లేనివారికి కూడా కృత్రిమంగా, మెదడును అయస్కాంత క్షేత్రానికి గురిచేసి అవే భావనలు కలిగించేందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అయితే వీటి ద్వారా దేవుడున్నాడనో, లేడనో నిరూపించడం వీలవదు. ఎందుకంటే నమ్మకం ఉన్నవారు అది కూడా దేవుడి పనేననీ, మనసుకు దేవుడి గురించి గుర్తుచేసేందుకే అటువంటి ఏర్పాటు జరిగిందనీ వాదించే అవకాశం ఉంది. ఎటొచ్చీ ఇతరత్రా నమ్మకం లేనివారికి అప్పుడప్పుడూ దృశ్యాలూ, ధ్వనులూ స్పష్టంగా వినబడి, కనబడినప్పుడు వారు దాన్ని దేవుడున్నాడనడానికి "ప్రత్యక్ష" సాక్ష్యంగా భావించి, ప్రభావితులు కావచ్చు. ఆ పరిస్థితుల్లో ఈ శాస్త్రీయ వివరణ ఉపయోగపడవచ్చు.

ఇవే కాదు. మెదడుకు సర్జరీ జరుగుతున్నప్పుడు పూర్తి మత్తుమందు ఇవ్వకుండా రోగులను డాక్టర్లు కొద్దిగా మాటల్లో పెడుతూ ఉంటారు. ఆ విధంగా తమ శస్త్రచికిత్సలో ఏ కారణం చేతైనా పొరపాటు జరిగి, రోగికి స్పృహ తప్పితే వెంటనే తెలుస్తుంది. ఇలా చేస్తూ, మెదడులోని కొన్ని భాగాలను స్పృశించినప్పుడు రోగులు తమకు తెలిసినవీ, ఎప్పుడో చిన్నప్పుడు జరిగినవీ సంగతులు గుర్తుకొచ్చాయని చెప్పడం జరిగింది. వీటిలో కొన్ని వాసనలూ, పాటల వరసలూ కూడా ఉండవచ్చు. అప్రయత్నంగా మనసు కలిగించే భావాలకు మరింత ఎక్కువ ప్రభావం ఉంటుంది కనక ఇది తెలుసుకోవడం అవసరం. మెదడుకు సంబంధించినంత వరకూ ఈ రకరకాల ఆలోచనలన్నీ మామూలుగా సాగే చిన్న చిన్న విద్యుత్ తరంగాలే.

మెదడులోని బీటా తరంగాలు సెకండుకు 13 నుంచి 30 దాకా ఉంటాయి. ఇవి చేతనావస్థనూ, కేంద్రీకృత తార్కిక ఆలోచనా ధోరణినీ, బహిర్వర్తన (ఎక్స్ట్రోవర్ట్) వైఖరినీ సూచిస్తాయి. సెకండుకు 7 నుంచి 13 దాకా ఉండే ఆల్ఫా తరంగాలు విశ్రాంతినీ, నిర్లిప్తస్థితినీ, ధ్యానాన్నీ, హిప్నోసిస్‌నూ సూచిస్తాయి. సెకండుకు 4 నుంచి 7 దాకా ఉండే తీటా తరంగాలు పగటికలలు కనడాన్నీ, సృజనాత్మకతనూ, ధ్యానాన్నీ, అతీంద్రియ సంఘటనలనూ, శరీరంనుంచి వేరయిన భావననూ, ఆధ్యాత్మిక భావాలనీ కలిగిస్తాయి. సెకండుకు ఒకటిన్నర నుంచి నాలుగేసి చొప్పున రేగే డెల్టా తరంగాలు గాఢనిద్రకు సంకేతాలు. మొదటిరకం ఎక్కువ తీవ్రతనూ, చివరివి తక్కువ తీవ్రతనూ కలిగి ఉంటాయి. తక్కినవి మధ్యస్తం. ధ్యానంలో ఉన్నప్పుడు ఇవన్నీ మారుతూంటాయి. ఈ మార్పులు స్థల, ప్రాంతాలతో సంబంధం లేకుండా అందరికీ (స్త్రీ పురుషులూ, పిల్లలూ, వృద్ధులూ) వర్తిస్తాయి.

గత వ్యాసంలో వివరించినట్టుగా బౌద్ధ భిక్షువులు ధ్యానంలో ఉన్నప్పుడు వారిపై జరిపిన పరీక్షల్లో

మెదడు ముందు భాగంలో ఆలోచనలని కేంద్రీకృతం చేసే ప్రక్రియలు వేగవంతం అయాయనీ, పరిసరాలనూ, స్థల స్వరూపాన్నీ గుర్తించే మెదడు పైభాగం మందగిస్తుందనీ తెలిసింది. క్రైస్తవ ఉపాసకులు మంత్రోచ్చారణ చేస్తున్నప్పుడు కూడా ఇదే జరిగింది. ధ్యానం చేసిన కొందరికి గుండెజబ్బుల నుంచి కొంత ఉపశమనం కూడా లభించింది. కాని ఆధ్యాత్మిక భావాల్లో కొన్ని దేవుడికి దూరమైపోతున్నట్టూ, అశాంతికి గురి అవుతున్నట్టూ కూడా అనిపిస్తాయి. పరిశోధనల్లో వీటన్నిటినీ పరిగణిస్తున్నారు. ప్రపంచంలో ఇంతమంది వేరువేరు రకాల మనుషులకు దేవుడిమీద నమ్మకం ఒకేపద్ధతిలో కలగడానికి కారణం ఏమిటి? ఇందులో వివిధ సంస్కృతుల మధ్య ఎక్కువ తేడాలు కూడా కనిపించవు. అంటే ఇటువంటి భావాలకు సులభంగా గురి అయే లక్షణాలు మెదడుకు ఉన్నట్టేనని తేలుతోంది. ఇందుకు భౌతిక కారణాలేపైనా ఉన్నాయా అని పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని ప్రయోగాల్లోమతపరమైన భావాలవల్ల లాభం పొందినట్టు అనిపించినడానికి కారణం ధ్యానం వగైరాలవల్ల మెదడులో కణతలవద్ద ఉండే భాగాలు ప్రేరితం కావడమే నని తెలుస్తోంది.

వీటి ముఖ్య ఉద్దేశమల్లా ఒకటే. కేవలం మెదడులో అకస్మాత్తుగా మెదిలే కొన్ని భావాలను బలహీనతలుగా చేసుకుని కొందరు మతం పేరుతో మోసాలు చెయ్యడం జరుగుతోంది. కనక మెదడులో ఇటువంటి అయోమయం అప్పుడప్పుడూ ఎందుకు కలుగుతోందో సామాన్య ప్రజలకు తెలియజెయ్యడం అవసరం. ముఖ్యంగా మన దేశంలో చేతబడులూ, మంత్రగాళ్ళ మీద నమ్మకాలు ఎక్కువ. కనీసం చదువుకున్నవారైనా నిజానిజాల గురించి ఆలోచించగలిగితే కొంత ప్రగతిని సాధించినట్టే. మెదడులో ఏదో కారణం చేత కలిగిన భౌతికమైన అలజడికీ, దేవుడున్నాడన్న నమ్మకానికీ సంబంధమేమీ లేదని తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ పరిశోధనలవల్ల కొన్ని మానసిక రుగ్మతలకు నివారణ కూడా కలగవచ్చు. ఇది మందులు లేకుండా మెదడుకు తగిన ప్రేరణలిచ్చి సాధించవచ్చు. గత వ్యాసంలో చెప్పినట్టుగా ఎపిలెప్సీవల్లనూ, మాదక ద్రవ్యాలవల్లనూ కూడా కొన్నిఆధ్యాత్మిక భావనలు కలుగుతాయి.

కొన్ని పరిశోధనల్లో "ప్రేతాత్మలు" ఆవేశించినవారి మెదడునూ, వారి నుంచి "సందేశాలు" అందుకుంటున్న ఇతరుల మెదడునూ పోల్చి చూస్తున్నారు. చైతన్యం అనేది మనిషి చచ్చిపోయినప్పుడు మెదడుతో బాటు అంతమౌతుందా, లేక శరీరానికి బయట "కొనసాగుతుందా" అనేదాన్ని గురించి కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. కొనసాగదంటే మనిషికన్నా బలీయమైన అతీతశక్తి ఏదో ఉందనేవారికి నచ్చదు. దేవుడి గురించి బలంగా కలిగిన భావాలన్నీ కూడా మెదడులోని నరాల విన్యాసాల వల్లనే అంటే వారు ఒప్పుకోరు. శాస్త్రవేత్తలుకొందరు మాత్రం దైవాన్ని గురించిన ఊహలన్నీ మెదడులో కలిగే భ్రమలేననీ,దేవుడనేవాడెవడూ లేడనీ అంటారు. మతాన్ని నమ్మేవారిలో కూడా బౌద్ధులు ధ్యానమే

ముఖ్యంగా భావిస్తారు. దేవుడున్నాడా లేడా అనేది వారికి ప్రధానం కాదు.

మెదడు అనేది కొన్ని అణువుల, కణాల సమ్మేళనం మాత్రమేనా? మతం అనే "సంగీతాన్ని" మోగించే వాయిద్యమే మెదడు కాదా? వాయిద్యానికీ సంగీతానికీ ఉన్న సంబంధమే మెదడుకూ, ఆలోచనలకూ ఉందనేవారూ ఉన్నారు. చూస్తున్న దృశ్యాలనూ, పొందుతున్న ఇతర అనుభవాలనూ మెదడు ఎలా పసిగడుతోందో దేవుడి ఉనికిని కూడా అలాగే గుర్తిస్తోందేమో? అన్నీ రసాయనిక మార్పులే అయినప్పుడు దేవుడి గురించిన భావాలు మాత్రం అబద్ధమెందుకు కావాలి? అదీ యదార్థమేనేమో?

అసలు యదార్థత అంటే ఏమిటి? మెదడులోనూ,మనసులోనూ కలిగే భావాలన్నీ యదార్థమైనవా? పరిణామవాదాన్ని బట్టి చూస్తే నిజమైన యదార్థమేదో తెలుసుకోవడం మెదడు యొక్క బాధ్యత కాదు. ప్రపంచంలో ప్రాణి యొక్క భద్రతనూ, మనుగడనూ కాపాడడమే దాని పని. తన ఉనికిని గుర్తించుకుని, స్వపర భేదాన్ని అర్థం చేసుకుంటూ, ఉన్న కాసిని ఇంద్రియాల సహాయంతో హానికి గురికాకుండా, ఆహారాన్నీ, ప్రమాదాలనూ కనిపెడుతూ, సంతానోత్పత్తిని సాధిస్తూ, వీలున్నంతకాలం ప్రాణాన్ని నిలుపుకోవడమే దాని విధి. ఇలా అంటే మనిషిని జంతువుల స్థాయికి దిగజార్చినట్టు అనిపిస్తుందేమో కాని ప్రాణికోటిలోని వివిధ జంతువుల శరీర నిర్మాణంలోని తేడాలను బట్టి చూస్తే మనిషికి మరీ గొప్ప ప్రత్యేకత ఏదీ లేదు. అందువల్ల కేవలం ఆలోచనలనూ, ఊహలనూ ఆధారం చేసుకుని "అన్నీ" తెలుసుననుకోవడం సరైనపని కాకపోవచ్చు.

## డెత్-రో పై ఉన్న ప్రఖ్యాత జర్నలిస్ట్ ముమియా అబు-జమాల్ తో ఇంటర్వ్యూ

ప్రఖ్యాత జర్నలిస్ట్ అయిన ముమియా అబు- జమాల్ (Mumia Abu Jamal) 1954, ఏప్రిల్ 24న ఫిలడెల్ఫియాలో జన్మించాడు. ఫిలడెల్ఫియాలో డేవిడ్ ఫాల్క్నర్ (David Faulkner) అనే పోలీస్ అధికారిని కాల్చి చంపాడన్న నేరారోపణపై ఆయన 1981 నుండి జైలులో, 1983 నుండి డెత్- రో పై (Death Row అంటే మరణ శిక్ష విధించబడి అది అమలయేందుకు ఎదిరి చూస్తూ జైలులో గడపడం) ఉన్నాడు. ఫిలడెల్ఫియాలోనే కాక ప్రపంచవ్యాప్తంగా నల్లవాళ్లపై జరుగుతున్న పోలీస్ దౌర్జన్యం గురించి, సాంఘిక, జాత్యహంకార వివక్ష గురించి ఆయన రాసిన పత్రికా నివేదికలకు ఆయనకు అవార్డులు లభించాయి.

అరెస్ట్ చేయబడిన సమయంలో ముమియా బ్లాక్ జర్నలిస్టుల సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నాడు. 14, 15 ఏళ్ల వయసులోనే ఆయన బ్లాక్ పాంథర్ పార్టీ ఫిలడెల్ఫియా విభాగానికి వ్యవస్థాపక సభ్యునిగా ఉన్నాడు. తర్వాత కాలంలో NPR వంటి రేడియో స్టేషన్లలో రిపోర్టర్గా, ఫిలడెల్ఫియా స్టేషన్ WHAT కి న్యూస్ డైరెక్టర్గా పని చేసాడు. అప్పట్లో MOVE అనే విప్లవ సంస్థపై తన కళ్లముందే రోజూ జరుగుతున్న అన్యాయాలపై, దౌర్జన్యాలపై జర్నలిస్ట్గా ఆయన దృష్టి సారించాడు.

ముమియాకి మద్దత్తు పలుకుతూ అంతర్జాతీయంగా ఒక విస్తృతమైన ఉద్యమం ఏర్పడింది. ముమియా కి జరిగిన అన్యాయాన్ని గుర్తిస్తూ కనీసం ఒక కొత్త విచారణన్నా మొదలు పెట్టాలని డిమాండ్ చేసిన వాళ్లలో నెల్సన్ మండేలా (Nelson Mandela), డానియెల్ మిట్టరండ్ (Danielle Mitterand, former first lady of France), ఫిడెల్ కాస్ట్రో (Fidel Castro), డానీ గ్లోవర్ (Danny Glover), సూసన్ సరాండన్ (Susan Sarandon), 22 మంది బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు, యురోపియన్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు.

అక్టోబర్ 2003లో, పారిస్ నగరం ముమియా అబు- జమాల్ను గౌరవ పౌరసత్వ (Honorary citizen) హోదాతో సన్మానించింది. 2006 లో అబూ- జమాల్ గౌరవార్థం పారిస్ పక్కనే ఉన్న సేంట్- డెనిస్ (Saint-Denis) అనే నగరంలోని ఒక వీధికి ఆయన పేరు పెట్టారు.

జైలులో ఇప్పటివరకు ఆయన అయిదు పుస్తకాలు రచించాడు, ఆయన వారం వారం రాసే ఎన్నో వ్యాసాలు ప్రపంచవ్యాప్తంగా అనేక పత్రికలలో ప్రచురించబడుతాయి. డెత్- రో పై ఉన్న ముమియా ఇప్పటికీ అణిచివేయబడ్డవాళ్ల కోసం ప్రిజన్ రేడియో (Prison Radio) ద్వారా తన గొంతుని వినిపిస్తూనే ఉన్నాడు. ప్రిజన్ రేడియో ద్వారానే 2004, ఏప్రిల్ 16న ప్రముఖ జర్నలిస్ట్, డెమాక్రసీ నౌ (Democracy Now) హోస్ట్ అయిన ఏమీ గుడ్మన్ (Amy Goodman)తో ముమియా ఇంటర్వ్యూ.

* * *

ఏమీ గుడ్‌మన్: ముమియా అబు-జమాల్ మరణ శిక్ష విధించబడి 20 సంవత్సరాలుగా డెత్ -రో పై జైలులో ఉన్నాడు. నిన్న 3.00 గంటలకు ఆయన ప్రిజన్ రేడియో ప్రాజెక్ట్ (Prison Radio Project) కి ఫోను చేసాడు. మేము ఆయనతో కేవలం 15 నిమిషాలు మాట్లాడాక ఫోను కట్ చేయబడింది.

ఏమీ గుడ్‌మన్: హలో?

కంప్యూటర్ గొంతు: గ్రీన్ స్టేట్ దిద్దుబాటు కేంద్రం (అమెరికాలో జైళ్ళని దిద్దుబాటు కేంద్రాలని పిలుస్తారు) (Greene State Correctional Institution) లో ఖైదీ అయిన ముమియా జమాల్ నుండి మీకు కలెక్ట్ కాల్ (కలెక్ట్ కాల్ అంటే ఫోన్ కాల్ తీసుకునే వారు డబ్బులు చెల్లించే పద్ధతి) వస్తోంది. ఈ ఫోన్ కాల్ ఒక దిద్దుబాటు కేంద్రం నుండి వస్తోంది, ఈ ఫోన్ కాల్ ని పర్యవేక్షించడం, రికార్డ్ చేయడం జరగవచ్చు. ఈ ఫోన్ కాల్ లో కస్టం కాలింగ్ (custom calling) సౌకర్యాలు అనుమతించబడవు. ఈ కాల్ కి మీకు, మొదటి నిమిషానికి □4.35, అదనపు ప్రతి నిమిషానికి 59 సెంట్లు పడుతుంది. ఈ కాల్ స్వీకరించదలుచుకోకపోతే వెంటనే ఫోన్ పెట్టెయ్యగలరు. కాల్ ను స్వీకరించడానికి 'సున్న' నొక్కండి. వెరైజన్ సెలెక్ట్ సర్వీసెస్ ఇన్‌కార్పోరేటెడ్ (Verizon Select Services Incorporated) ని ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. మీరు ఇక ఫోన్ మాట్లాడుకోవచ్చు.

ఏమీ గుడ్‌మన్: హలో, ముమియా?

ముమియా అబు-జమాల్: హలో.

ఏమీ గుడ్‌మన్: హాయ్! నేను ఏమీ గుడ్‌మన్ ని మాట్లాడుతున్నాను.

ముమియా అబు-జమాల్: హలో, ఏమీ, ఎలా ఉన్నావు?

ఏమీ గుడ్‌మన్: బాగున్నాను. డెమాక్రసీ నౌ కి స్వాగతం.

ముమియా అబు-జమాల్: సరే! నరకానికి స్వాగతం.

ఏమీ గుడ్‌మన్: రెండు సంవత్సరాల క్రితం ఫెడరల్ జడ్జ్ యోన్ (Yohn) మీ కేసుపై 180 రోజులలో తిరిగి తీర్పు చెప్పి శిక్ష తిరగరాయాలని నిర్ణయించినా మీపై విధించిన మరణశిక్ష అలాగే ఉంది. ఆయన మీపై ఉన్న మరణశిక్ష ని కొట్టివేసి, యావజ్జీవ కారాగార శిక్షని విధించినా, ఇంకా డెత్-రో పై ఎందుకు ఉన్నారు?

ముమియా అబు-జమాల్: సరే ! ఆపరేషన్ ఆఫ్ లా (Operation of Law) అనేది ఒకటి ఉంది, దాని ప్రకారం కామన్‌వెల్త్ వెంటనే అపీల్ చేసింది. దానితో జడ్జ్ యోన్ ఇచ్చిన తీర్పు మీద స్టే వచ్చింది. జడ్జ్ యోన్ మరణశిక్షని తిరగరాస్తూ తీర్పు ఇవ్వడం జరిగినా అట్లాంటిదేమీ ఎప్పుడూ జరగనట్టే లెక్క.

ఏమీ గుడ్‌మన్: మీరు ఉన్నదగ్గర ఎలా ఉంటుందో చెప్తారా?

ముమియా అబు-జమాల్: చెప్పాలంటే పెద్ద కష్టంగా ఏమీ ఉండదు, ఎందుకంటే ఇప్పుడూ ఇంతకముందు ఉన్నట్టే ఉంది. (బిగ్గరగా నవ్వుతూ). నేను అక్షరాలా ఇంకా డెత్-రో పైనే ఉన్నాను. నేనొక డెత్-రో గదిలో ఉన్నాను, నా చుట్టూ మరణశిక్ష కోసం ఎదురుచూస్తున్న మిగిలిన ఖైదీల గదులున్నయి. ఒక్కో వరుసలో 24 గదులుంటాయి. ఇక ప్రతిరోజూ 22 గంటలు సెల్ లోపల - బయటికి వెళ్లాలనుకున్నవాళ్లు, 2 గంటలు సెల్ బయటికి వెళ్లొచ్చు.

ఏమీ గుడ్‌మన్: 55 సంవత్సరాల క్రితం ఏప్రిల్ 15 1949 న సరిగ్గా ఇదే సమయానికి, తను నమ్మిన సిద్ధాంతాలకనుగుణంగా సామాజిక అన్యాయాల పట్ల నిర్భయంగా ఆగ్రహాన్ని ప్రకటించే స్వభావం గల వాడూ, పసిఫికా (Pacifica) రేడియో స్థాపకుడూ ఐన లూ హిల్ (Lou Hill), తన కొత్త రేడియో స్టేషన్ KPFA పై మొదటిసారి మాట్లాడుతూ, ఈ దేశంలో స్వతంత్ర మీడియాకి నాంది పలికిన ఒక సరికొత్త ప్రయోగానికి ప్రజలను స్వాగతించాడు. పసిఫికా రేడియో 55వ వార్షికోత్సవం సందర్భంగా మనం మాట్లాడుకుంటున్న ఈ సమయంలో మీరు మీ గొంతుని బయిటి ప్రపంచానికి ఎలా వినిపిస్తారో, స్వతంత్ర ప్రచార సాధనాల పాత్ర ఏమిటో వివరించండి.

కంప్యూటర్ గొంతు: ఈ ఫోన్ కాల్ ఒక దిద్దుబాటు కేంద్రం నుండి వస్తోంది, ఈ ఫోన్ కాల్ ని పర్యవేక్షించడం, రికార్డ్ చేయడం జరగవచ్చు.

ముమియా అబు-జమాల్: నేనూ ఇంచుమించు మీలానే నా గొంతు వినిపిస్తాను. కాకపోతే నాకు అందుబాటులో ఉన్న వనరులు ఎలాగూ చాలా తక్కువ. గొంతులు నొక్కివేయబడ్డ ప్రజల కోసం నేను అలోచిస్తాను, వాళ్ల గొంతులు వినడానికి ప్రయత్నిస్తాను. సహాయం కోసం అర్థిస్తున్నా ఎవరూ వినిపించుకోని ప్రజల గొంతుల్ని వింటాను. అధికారం లేని నిస్సహాయులైన ప్రజలు. నీకు, నాకు నిజంగా చాలా దగ్గరైన ప్రజలు. మామూలు ప్రజలు. మీరు మీ కొత్త పుస్తకంలో చాలా బాగా చెప్పినట్టు చాలా మటుకు పత్రికా రచయితలు అధికారం ఉన్నవాళ్ల కోసమే పని చేస్తుంటారు. ప్లేటుకి □100, □200 ఖరీదు చేసే డిన్నర్‌లకు హాజరవుతుంటారు. మీకు ఇండొనేసియా అవార్డు ఇచ్చిన డిన్నర్‌లో ప్లేటుకి □1500 అనుకుంటాను. అట్లాంటి వాటికి, అట్లాంటి మనుషులకి పత్రికలల్లో చాలానే చోటు ఉంది. కాని అధికారం లేనివాళ్లకూ, పలుకుబడి లేనివాళ్లకూ, నిస్సహాయులకూ, బజారుల్లో నడిచే మామూలు ప్రజలకూ పత్రికల్లో తగినంత చోటు లేదు. ఉద్యోగం ఊడుతుందేమోనని భయపడుతున్న వాళ్లు, ఉద్యోగం కోసం ఆందోళన చెందుతున్నవాళ్లు, ఇల్లు ఖాళీ

చేయాల్సివస్తుందనో లేదా జైలు పంజరంలో బతకవలసి వస్తుందనో భయపడుతున్నవాళ్లు. వీళ్లు. వీళ్లే నిజంగా కనబడకుండా, వినబడకుండా, ఏ లెక్కలకు రాకుండా పోయేవాళ్లు. బ్రతుకు కోసం నిత్యం పోరాటం చేస్తున్నవాళ్లు వీళ్లే. ఈ గొంతులనే, ఈ మామూలు మనుషుల గొంతులనే మనం వినిపించాలి.

ఏమీ గుడ్‌మన్: ముమియా అబూ-జమాల్, మీరు "We want freedom: A life in Black Panther Party" అనే ఒక కొత్త పుస్తకం రాశారు. మీకు మరణ శిక్ష పడడానికి బ్లాక్ పాంథర్ పార్టీలో మీ జీవితం కొంత దోహదపడి వుండొచ్చు. దాని గురించి అడిగేముందు మీరు పుస్తకాలు ఎట్లా రాస్తారో అడగదలుచుకున్నాను. జైలులో పుస్తకం రాసే అనుభవం ఎట్లా ఉంటుంది?

ముమియా అబు-జమాల్: నా ఉద్దేశంలో ఒక్కో పుస్తకం రాసిన అనుభవం దేనికి అదే ప్రత్యేకం. మొదటి పుస్తకం "Life on Death Row" సుమారు మొత్తం చేతివ్రాతలో రాసిందే. నిజం చెప్పాలంటే అది ఒక వ్యాస సంకలనం. ఎవరో నన్ను నాకు నచ్చిన విషయాల గురించి రాస్తుండమని అడిగారు, అట్లా నేను ఒక వ్యాసాల పరంపర రాయడం మొదలుపెట్టాను. నోయెల్ హన్‌రాహన్ (Noelle Hanrahan) అవన్నీ కలిపి ప్రచురిస్తే ఒక గొప్ప పుస్తకం అవుతుందని సూచించింది. నేను దాన్ని నవ్వులాటగా కొట్టిపారేసాను. కాని తను ఇది చాలా మంచి ఆలోచన అంటూ నన్ను వదిలిపెట్టలేదు. ఆమె అన్నది నిజమని రుజువయింది. అది అంత మంచి ఆలోచన అని నేను ఎప్పుడూ అనుకోలేదు ఎందుకంటే అది అంత గొప్ప విషయం అని నేను అనుకోలేదు. నేను మామూలు మనుషుల గురించి రాస్తున్నాను, అదేమంత అసామాన్యమైనదిగా అనిపించదు. ప్రతీ పుస్తకం దేనికదే తనదైన పద్ధతిలో రూపుదిద్దుకుంది. ఈరోజు నేను టైప్‌రైటర్ ఉపయోగిస్తుండవచ్చు కాని ఇది ఒక ఒంటరి ప్రయత్నం, ఒక ఏకాంతమైన, గంభీరమైన అవస్థలో ఈ ప్రయత్నం చేస్తున్నాను. నేను కేవలం నా కళ్లను, చెవులని తెరిచి ఉంచి వెలుగులోకి రాని ఆ కథల గురించి అలోచించడానికి ప్రయత్నిస్తాను. నా చివరి రెండు పుస్తకాలు, ఒకటి నువ్వు ఇంతకముందు చెప్పింది, దానికన్నా ముందు Faith of our Fathers అనే పుస్తకం, రెండూ వర్తమానం గురించి గాక గతం గురించి మాట్లాడిన నేను రాసిన మొదటి చరిత్ర పుస్తకాలు. Faith of our Fathers అమెరికాలలో గత 500 సంవత్సరాలలో ఆఫ్రికన్‌ల, ఆఫ్రికన్ అమెరికన్‌ల ఆధ్యాత్మిక జీవితాన్ని చూపిస్తుంది. We Want Freedom సుమారు 30 సంవత్సరాల క్రితం బ్లాక్ పాంథర్ పార్టీ అవతరణ గురించి, బలపడటం గురించి మాట్లాడుతుంది. ఆ రెండు పుస్తకాలు గతంలోకీ, చరిత్రలోకీ నా ప్రయాణాలు.

ఏమీ గుడ్‌మన్: బ్లాక్ పాంథర్ పార్టీ లో మీ జీవితం గురించి మాట్లాడండి. అప్పుడు మీ వయసెంత? ఇప్పుడు జైలు నుండి బ్లాక్ పాంథర్ పార్టీ గురించి ఏ కోణాన్ని తెలియజేయాలనుకుంటున్నారు?

ముమియా అబు-జమాల్: నేను పార్టీలో చేరినప్పుడు నాకు 14, 15 సంవత్సరాలు ఉండి ఉండవచ్చు. ఫిలడెల్ఫియాలోనే కాకుండా న్యూ యార్క్‌లోని బ్రాంక్స్‌లో, బర్క్‌లీలోని జాతీయ కార్యాలయంలో, కాలిఫోర్నియాలోని ఒక్ల్యాండ్ దగ్గర పనిచేసే అదృష్టం నాకు కలిగింది. కొందరు అద్భుతమైన మనుషుల్ని

కలిసాను. నేను చదివిన అన్ని పుస్తకాల్లో, చాలామటుకు చదివాను, అన్నీ అయితే కాదు, కాని చాలా మటుకు…

కంప్యూటర్ గొంతు: ఈ ఫోన్ కాల్ ఒక దిద్దుబాటు కేంద్రం నుండి వస్తుంది, ఈ ఫోన్ కాల్ ని పర్యవేక్షించడం, రికార్డ్ చేయడం జరగవచ్చు.

ముమియా అబు-జమాల్: ఆహ్! రికార్డ్ చేస్తున్నట్టు మనకు తెలియదు, కదూ? బ్లాక్ పాంథర్ పార్టీ గురించి నేను చాలా పుస్తకాలు చదివాను, ఎన్నో చెప్పదగిన గొప్ప కథలు చెప్పబడలేదని నాకు అనిపించింది. ముఖ్యంగా పార్టీ లో పని చేసిన స్త్రీల గురించి. పార్టీ లో తమ స్వంత అనుభవాల గురించి రాసుకున్న స్త్రీలు ఉన్నారు. కాని పార్టీకి వెన్నెముకలా, పార్టీకి ఆత్మ , జీవమై పని చేసిన మామూలు, అనామక స్త్రీల గురించి ఎవరూ రాయలేదు. అందరికీ హ్యూ (Huey) గురించి, ఎల్డ్రిడ్జ్ (Eldridge) గురించి తెలుసు, కాథ్లీన్ (Kathleen) గురించి, ఎలేన్ బ్రౌన్ (Elaine Brown) గురించి అందరూ మాట్లాడుతారు. కాని మామూలు, రోజువారీ సాధారణ స్త్రీలు ఆ సంస్థకి పట్టుకొమ్మలై నిలిచారు. పార్టీ కార్యక్రమాలను ప్రజలు ఎంతో ఉత్తేజపూరితంగా తమ వాడల్లోకి తీసుకుపోయారు. సోఫీ బుకారి (Sophie Bucari) లాంటి వాళ్ళు, అనామకంగా మిగిలిపోయిన వందల వేల ఇతర స్త్రీలు - వాళ్లే ఆ కథ చెప్పడానికి నాకు ప్రేరణ అనుకుంటాను, బహుశా ఆ పని నేను సరిగ్గా చేశాననే అనుకుంటున్నాను.

ఏమీ గుడ్‌మన్: ముమియా అబూ-జమాల్, ప్రస్తుతం 9-11 తర్వాత స్వదేశీయ గూఢచార యంత్రాంగం (Domestic Spy Agency) ఉండాలా వద్దా అనే దాని గురించి చర్చ జరుగుతుంది. మీ పుస్తకంలో ఆరవ అధ్యాయంలో COINTELPRO గురించి, దాడి చేస్తున్న సామ్రాజ్యం గురించి రాసారు. దాని ప్రభావం గురించి మాట్లాడండి.

ముమియా అబు-జమాల్: ఇప్పుడు మనం ఎదురుకుంటున్నదానికి నిజంగా పునాది వేసింది COINTELPRO అని చెప్పాలి. FBI భాషలో "బ్లాక్ బాగ్ జాబ్స్" (Black bag jobs) అనబడే ఉత్తరాలు దొంగిలించడాలు, చట్టవిరుద్ధంగా ఇళ్లల్లోకి చొరబడి తనిఖీలు చేయడాలు, అన్నీ 30 ఏళ్ల క్రితం చట్టవ్యతిరేకం. ఇన్‌ఫార్మర్లను, ఏజెన్సీ ప్రొవకేటర్ (agency provocateur)లను రాజ్యాంగం "మొదటి సవరణ (First Amendment) అభయమిచ్చిన ప్రాథమిక హక్కుల" కొరకు పోరాడుతున్న ప్రజా సంఘాలను ధ్వంసం చేయడానికి ఉపయోగించడం, ఇవన్నీ అప్పట్లో చట్టవ్యతిరేకం. ప్రభుత్వం తరఫున అట్లాంటి పనులు చేసేవాళ్లని వాళ్ల పై అధికారులు, "నీవు దొరికితే, జైలుకి వెళ్లవలసి వస్తుంది", అని హెచ్చరించేవాళ్లు. అయినా FBI ఏజెంట్లు ప్రజల ఇళ్లల్లోకి చొరబడి, వాళ్ల ఇళ్లని సోదా చేసి, వాళ్ల వస్తువుల్ని ఫోటోలు తీసుకొని, వాళ్లని కేసుల్లో ఇరికించేవాళ్లు. కాకపోతే అట్లాంటి పనులు అప్పుడు చట్టవ్యతిరేకం. ఇప్పుడు ఏర్పడిన చట్టాల ప్రకారం, దేశభక్త చట్టం (Patriot Act) ప్రకారం, ఈ పనులన్నీ ఇప్పుడు చట్టప్రకారం చేయవచ్చు. ఇప్పుడు వాళ్లు ఎవరి

ఇళ్లలోకైనా చొరబడవచ్చు. ప్రజల ఫోన్‌లను టాప్ చేయవచ్చు. కంప్యూటర్‌లను తెరిచి చూడవచ్చు. గ్రంథాలయాలలోని రికార్డులను వెతకవచ్చు, వ్యక్తిగత సమాచారాలను ఫైల్‌లలో భద్రపరచవచ్చు, ప్రజాసంఘాలలోకి ఇన్‌ఫార్మర్లుగా చొరబడవచ్చు. ఇవన్నీ ఇప్పుడు చట్టం అనబడేదాని రక్షణలో చేయవచ్చు. ఇది చాలా ఘోరమైన పరిణామం. భయంతో మనుషులు ఎలాంటి పనులు చేయడానికైనా సిద్ధమవుతారనడానికి ఇది ఒక నిదర్శనం. దేశభక్త చట్టం పాస్ అయిన కొన్ని రోజుల తర్వాత, BET చానల్ (channel) చూస్తుంటే, మంచి పేరున్న, నల్ల జాతీయుడైన ఒక పార్లమెంటు సభ్యుడు టీ.వి లో ఇలా అన్నాడు, "నేను ఆ చట్టాన్ని అంగీకరిస్తూ సంతకం చేసాను. సభలో చాలా మందిమి సంతకం చేసాం, కానీ నేను ఆ బిల్లుని చదవలేదు." నేను అది ఎప్పుడూ మర్చిపోలేను. నేను వింటున్నది నేను నమ్మలేకపోయాను. ఆయన, "మమ్మల్ని ఈ పని ఇప్పుడే చేయాలని అన్నారు, మేము వెంటనే చేయాల్సివచ్చింది", అని అన్నాడు. ఆంత్రాక్స్ (Anthrax) లాంటి వాటి గురించి భయాలు గుప్పుమంటున్న రోజులవి. బార్బరా లీ (Barbara Lee) తప్ప మిగిలినవాళ్లు అందరూ 'లేదు' అనడానికి ఎంత భయపడ్డారంటే ఎన్నో హక్కులని సాధించుకున్న రాజ్యాంగ నాలగవ సవరణ (Fourth Amendment) ని ఖచ్చితంగా, మొదటి సవరణని కొన్ని రకాలుగా, ఆరవ సవరణని కొన్ని రకాలుగా కాలరాసే చట్టాన్ని సమర్థిస్తూ సంతకం చేసారు. ఒకవైపు తన న్యాయవాదితో ఎవరి సంభాషణనైనా కూడా వినగలిగిన ప్రభుత్వం ఉంటే మరో వైపు ఎలాంటి ప్రాతినిధ్యం లేని ప్రజలు. ఇది చాలా ఘోరమైన పరిస్థితి. పూర్వం COINTELPRO రోజుల్లో లాగానే, ఇంకా వెనక్కి వెళ్తే పామర్ రేడ్ (Palmer Raid), ఎమ్మా గోల్డ్‌మన్ (Emma Goldman), అలెక్సాండర్ బర్క్‌మన్ (Alexander Berkman) రోజుల్లో లాగానే మళ్లీ ప్రభుత్వానికి భయం అనేది పరిపాలనలో ఒక ప్రధాన మూలసూత్రం ఎలా అవుతుందో మనకి అర్థమవుతుంది. భయం రాజ్యమేలుతున్నపుడు, హక్కులన్నీ మురుగుకాలువలో పడి కొట్టుకుపోతాయి.

ఏమీ గుడ్‌మన్: మనం మాట్లాడుకోడానికి ఇంకా కొన్ని నిమిషాలు ఉన్నాయి, All Things Censored అనే పుస్తకంలో పూర్వం డెమాక్రసీ నౌ తో మీరు మాట్లాడుతుండగా జైలు అధికారులు ఫోన్‌ని గోడ నుండి లాగిపారేసిన ఉదంతం గురించి రాసారు. జైలు నుండి మీ గొంతుని బయటి ప్రపంచానికి వినిపించడంలో ఉన్న అనుభూతి గురించి చెప్పండి.

ముమియా అబు-జమాల్: ఎన్నో రకాలుగా, నేను…

కంప్యూటర్ గొంతు : ఈ ఫోన్ కాల్ ఒక దిద్దుబాటు కేంద్రం నుండి వస్తోంది, ఈ ఫోన్ కాల్ ని పర్యవేక్షించడం, రికార్డ్ చేయడం జరగవచ్చు.

ముమియా అబు-జమాల్: ఎన్నో రకాలైన అనుభూతులని పొందాను, ప్రత్యేకించి, ఒక మంచి వ్యాఖ్యానం చేసాననో లేదా ఒక మంచి కథ రాసాననో అనిపించినపుడు అది ఒక స్వేచ్ఛానుభూతిని ఇస్తుంది. ఎందుకంటే నువ్వు చాలా ముఖ్యం అని పరిగణించే ఒక విషయాన్ని ప్రజలతో పంచుకుంటున్నప్పుడు అది వాళ్లకు ఒక

స్వేచ్ఛానుభూతిని, ఒక జ్ఞానోదయం లాంటి అనుభూతిని కలిగించవచ్చు. మీరు ఇంతకముందు గుర్తుచేసిన సంఘటన గురించి నేను ఎప్పుడూ మర్చిపోలేను, ఆరోజు నేను మీ ప్రొడక్షన్ లో పని చేసేవాళ్లలో కొంత మందితో మాట్లాడాను, మీరు నన్ను ఒక్క నిమిషం ఫోన్ పై హోల్డ్ లో పెట్టారు. మాట్లాడడం మొదలుపెట్టాక, అకస్మాత్తుగా ఫోన్ పనిచేయడం ఆగిపోయింది. అప్పుడప్పుడు, సాంకేతిక ఇబ్బందుల వల్ల అట్లా జరుగుతుంటుంది, అట్లానే జరిగింది అనుకున్నాను. అంతలో ఒక గార్డు 'ఫోన్ నాకు ఇవ్వు! ఫోన్ నాకు ఇవ్వు!' అంటూ అరుస్తూ వచ్చాడు. "ఏమయింది" అని నేను అడిగాను. నాకు ఏమీ చెప్పకుండా మళ్లీ "ఫోన్ నాకు ఇవ్వు" అని అరవడం మొదలు పెట్టాడు. ఇంతలో జైలు అధికారుల గుంపు ఒకటి కనబడింది, అందులో ఒక అధికారి వైపు చూసాను, "చూడు, పైనుండి ఒక ఫోన్ కాల్ వచ్చింది", అని అన్నాడు. అంతే. అదొక్కటే వాళ్లు నాకు చెప్పింది.

కంప్యూటర్ గొంతు: మీరు మాట్లాడడానికి ఇంకా ఒక్క నిమిషం సమయం మాత్రమే ఉంది.

ఏమీ గుడ్‌మన్: ముమియా, నేను ఒక ప్రశ్న అడగాలి. ఇంకో పదిహేను నిమిషాల కొరకు మళ్లీ ఫోను చేయగలరా?

ముమియా అబు-జమాల్: లేదు, కంప్యూటర్ షట్ డౌన్ అవుతుంది. ఈ కాల్ తర్వాత, మళ్లీ 24 గంటల వరకు నేను ఎవ్వరికీ, ఎక్కడికీ ఫోన్ చేయలేను.

ఏమీ గుడ్‌మన్: చివరగా ఒక ప్రశ్న అడుగుతాను, మీరు పోలీస్ ఆఫీసర్‌ని చంపలేదని ఎప్పుడూ బాహాటంగా ఎందుకు అనలేదని చాలా మంది అడుగుతారు. దానికి మీ సమాధానం?

ముమియా అబు-జమాల్: నేను అట్లా అనలేదనటం నిజం కాదు. నేను ఆఫీసర్‌ని చంపలేదని అన్నాను. అలా అనడం ఎక్కడ ఐతే అన్నింటికన్నా ముఖ్యమో అక్కడ అన్నాను. న్యాయస్థానంలో నా ముందు ఉన్న జూరీతో అన్నాను. నేను నిర్దోషినని వాళ్లతో అన్నాను. ఆ జూరీ, ఎవరంటే...

కంప్యూటర్ గొంతు: మీరు మాట్లాడడానికి ఇంకా 15 సెకండ్ల సమయం మాత్రమే ఉంది.

ముమియా అబు-జమాల్: నాకు మరణ శిక్ష వేసిన 12 మంది జూరీ సభ్యులు నేను అట్లా అనడం విన్నారు. నా తరఫున న్యాయవాది కూడా సరిగా లేని విచారణ (trial)లో కూడా విన్నారు.

ఏమీ గుడ్‌మన్: పెన్సిల్వేనియా లోని డెత్-రో నుండి మాట్లాడుతున్న ముమియా అబూ-జమాల్. అంతటితో మా సంభాషణ బలవంతంగా ముగించబడింది. మీరు వింటున్నది డెమాక్రసీ నౌ!

6

'పాపం మీనాయనగారు పెద్దమనిషి. ఆయన గతించినప్పటి నుండి అన్నీ చిక్కులేనని విన్నాను'' రామభూపాల్‌రావు మాట్లాడటానికి పిలిపించిన వెంకటాచారితో పరామర్శగా అన్నాడు. రామభూపాల్‌రావు ఆవిధంగా శాంతంగా, చనువుగా మాట్లాడటం వెంకటాచారికి ఆశ్చర్యం వేసింది. రామభూపాల్‌రావు ఎల్లప్పుడు అధికార ధ్వనిలో మాట్లాడటం అతనికి తెలిసన సంగతి. రామభూపాల్‌రావు అంటే వెంకటాచారికి భయం కూడాను.

“మీకు తెలియందేముంది?'' వెంకటాచారి నీళ్ళు మింగుతూ అన్నాడు.

“మీ నాయనగారు పాపం చదువుకున్నవాడే. పూజనీయుడే. కాని చదవుకున్నాననే గర్వం మాత్రం బాగావుండేది. అదే ఆయనకు చెరుపు చేసింది. ఉన్న ఆకాస్త భూమిని పోగొట్టుకొని మీ అందరికి కష్టాలు తెచ్చాడు'' రఘునాథాచార్యులు గురించి తన అభిప్రాయం ప్రకటించాడు రామభూపాల్‌రావు.
ఏమి సమాధానం ఇవ్వాల్సింది వెంకటాచారికి తోచలేదు. తల నేలకు వేసి రామభూపాల్‌రావు అంటున్న దేమిటో ఆలోచించసాగాడు.

“మీ తమ్ముడు నీకు ఎదురు తిరగబడతాడట నిజమేనా? తమ్ముడిని హద్దుల్లో పెట్టుకోలేకపోయావా?'' ఒరకంటితో వెంకటాచారిని చూస్తూ రామభూపాల్‌రావు అన్నాడు.

“చిన్నప్పటి నుంచి మా అమ్మ గారాబంతో వాడావిధంగా చెడిపోయిండు'' వెంకటాచారి సమాధానమిచ్చాడు.

“నిన్ను మీ నాయన పోకిరివాణ్ణి చేసిండని ఊరంతా అనుకుంటుంది. నువ్వు మీ అమ్మను కొడతావటగదు! కన్నతల్లిని కొడతారయ్య ఎన్నడన్నా'' రామభూపాల్‌రావు కొంచెము అధికార ధ్వనిలో అన్నాడు.

“మా తమ్ముడు చెప్పేడా ఆ సంగతి?'' అంటూ వెంకటాచారి భయంగా చూచాడు.

'' ఎవరు చెప్పితేం, సంగతైతే నిజమేగదా? మీ తమ్ముడు పిలిస్తేనే ముఖం తప్పించుకొని తిరుగుతాడు. మీ నాయనకంటే రెండింతలు గర్వం ఎక్కువుంది మీ తమ్ముడికి. సరేగాని ఒక విషయం అడుగుదామని పిలిపించాను. మీ మేలుకే, ఇందులో నా కొచ్చేదేమీ లేదు.'' గొంతు సవరించుకున్నాడు రామభూపాల్‌రావు.

“మీరనడం, నేను కాదనటమా? ఎప్పుడైనా అట్లా జరిగిందా?'' వెంకటాచారి వినయంగా అన్నాడు.

''నేను రేపు తహశీలుకు పోతున్నాను. నీవుకూడా వస్తే మీ భూమిని నీ పేరు మీద చేయించి వేస్తా. ఇంకా నీకు పెండ్లి కావలసివుంది. ఈడు ముదిరిపోతున్నది. కౌలుకో, పొత్తుకో భూమి ఇచ్చావంటే దిగులు లేకుండా జరిగిపోతుంది. మీ అమ్మ పెద్దమనిషై పోయింది. నీకు రెండు ముళ్ళు పడ్డాయంటే కోడలు, సంసారంతో ఆనందంగా బతుకుతుంది. ఇది చెప్పదామనే పిలిపించాను. రేపు భోంచేసి బయలుదేరుతున్నాను'' అంటూ రామభూపాల్‌రావు కుర్చీలోంచి లేచి వెళ్ళబోయాడు.

''సరే! మీ దయ. వెళ్ళొస్తాను'' అంటూ రామభూపాల్‌రావు దండం పెట్టకున్నా వెంకటాచారి దండం స్వీకరించినట్టు చేతులు ఆడించి ఇంటికి వెళ్ళాడు.

వెంకటాచారి ఎంతో గొప్పవాడుగా, ఏదో సాధించినట్టుగా ఒళ్ళు మరచి ఇంటికి చేరాడు. ఆ సంగతి తల్లికి చెప్పదామనుకున్నాడు మొదట. కాని '' ఏమిటి చెప్పేది? చెపితే ఆమె చేసేదేముంది? చిన్నకొడుకు వెళ్ళిపోవడం వల్ల వచ్చిన కోపం, దు:ఖంలో నా యోగ్యత, గొప్పతనం ఆమెకేమి అర్థమవుతుంది?'' అనుకున్నాడు. భోజనం చేస్తున్నపుడు ''రేపు దొరవారితో కామారెడ్డికి పోతున్నాను'' ముఖం వంచుకుని అన్నాడు.

దొరవారితో అప్పుడప్పుడు ఆ విధంగా వెళ్ళడం మామూలే. అందువల్ల ఆమె ఏమీ అనలేదు. ''తమ్ముని జాడ ఏమైన తెలిసిందా!'' మెల్లగా అడిగింది తల్లి.

''ఎక్కడ తెలిసే, అప్పుడు పొయ్యి యిప్పుడు వస్తుసేవుంటిని. ఇహ నీకు పనేముంది? అన్నం తిని అదే పని చెయ్యి. గారాబాల కొడుకు లేకపోతే నువ్వు వుండలేవుగా!'' హేళనగా వెంకటాచారి అన్నాడు.

''నీకు మాత్రం ప్రేమ లేదు? ఏదో ఉద్రేకంలో ఆవిధంగా మాట్లాడుతున్నావు కాని ఒక కడుపున పుట్టినవాండ్లకు ప్రేమలుండకపోతే ఇంకెవరికుంటాయి కొడుకా?'' గుడ్లలో నీరుతీస్తు గద్గద స్వరంతో తల్లి అన్నది.

''ఇవన్నీ చిన్నప్పటినుంచి వాడికి చెప్పితే వాడింతవరకు రాకనే పోవు. వాడికి చిన్నప్పటి నుంచి మంది సహవాసమేనాయె. తురకపంతులు శిక్షణ, శూద్రుల సహవాసం. పెద్ద బుద్ధులు ఎట్లా వస్తాయి?'' అంటూ లేచి చేతులు కడిగి వంట ఇంటి నుండి బయటికి వచ్చేశాడు.

తల్లి ఆండాళమ్మ వంటింట్లో అన్ని సదిరిపెట్టి, మైలుపడి తుంగచాప పరుచుకొని పండుకొన్నది. పైటకొంగును ముఖంనిండా కప్పుకొని లోలోపల కుమలసాగింది.

వెంకటాచారి ఏదో గొణుగుకొంటూ తాంబూలం వేసికొన్నాడు. హడావిడిగా యిల్లు వదలి ఊళ్ళోకి వెళ్ళాడు.

మరునాడు భోజనం చేసుకొని రామభూపాల్‌రావుతో వెంకటాచారి కామారెడ్డికి బయలుదేరాడు. కచ్చడంలో రామభూపాల్‌రావు కూర్చున్నాడు. కచ్చడం తొట్లో వెంకటాచారి

కూర్చొని బండి తోలుతున్నాడు. కచ్చడం ముందట ఒక మనిషి, వెనుక ఒక మనిషి ఉరుకుతున్నారు. కచ్చడపుటెడ్ల మెడకు కట్టిన మూగల గల్లు గల్లు చప్పడుతో, దుమ్ము రేపుతూ కచ్చడం వడిగా పోతున్నది.

“కొంచెం మెల్లగా పోనియ్యి” రామభూపాల్‌రావు అన్నాడు.

వెంకటాచారి ఎడ్ల తోకలను వదిలాడు. ఎడ్లు ఉరికి ఉరికి వాటంతట అవే మెల్లగా నడవసాగాయి.

“నిన్న నీకు చెప్ప మరచిపోయిన. నీతో ఇంకొక పని ఉంది. అంతా గుట్టుగా వెళ్ళిపోవాలె. నీవు తొందరపడొద్దు. నీవు భయపడాల్సిందేమీ లేదు” రామభూపాల్‌రావు సంభాషణ సాగించాడు.

” ఏదో ఆ పని. సెలవివ్వండి” అంటూ వెంకటాచారి రామభూపాల్‌రావు వైపు తిరిగి కూర్చున్నాడు.

“కోటయ్య కొడుకు కొమరయ్య తోటబావి ఎరికేగా?”

“అదే, చెరువు అవతలిది. మామిడి చెట్లు కూడా ఉన్నాయి.”

” ఆ. అదే. అవును కదు! ఎన్నిసార్లు నీవు మామిడి పిందెలు తెంపుక రాలేదు గడీలోకి. ఆ తోటబావి ఉందే, న్యాయంగా చూస్తే కొమరయ్యది కాదు.”

“అట్లాగా? తనది కాందే బావికి రాతికట్టం, మామిడి చెట్లు - ఇవన్ని చేయించాడా?”

” ఎవరూ ఏమీ అనకపోతే తనదేనని మింగేయటానికి అట్లా జరుగుతూంటే, మేము ఇటువంటి అన్యాయాన్ని చూస్తూ ఊరుకుంటామా? అందుకే, ఆ మోటబావి కింది భూమిని నా పేర చేయించుకోవాల్నని అనుకుంటున్నాను.”

“కొమరయ్య అందుకు ఒప్పుకుంటాడా?”

” ఆ వెధవను ఎవడు బ్రతిమిలాడుతాడు? ఖానూను ప్రకారం జరుగాలెగాని నీవు కొంచెం తెలివిగా పనిచేశావంటే నేను అనుకున్న పని సులభంగా అయిపోతుంది.”

” ఇంతకూ ఆ భూమి ఎవరి దంటారు?”

” అది అసలు అడగాల్సిన ప్రశ్న. మన ఊళ్ళో ఒక బ్రాహ్మణ కుటుంబం కూడా ఉండేది. వాళ్ళది అసలు ఆ భూమి. వాండ్ల అతి గతి ఇప్పడేమి తెలియడం లేదు. ఆ బ్రాహ్మణుడు చచ్చింతర్వాత అతని భార్య, ఓ చంటి పిల్లవాడు ఊరు వదిలి వెళ్ళిపోయారు. అంతేమరి. పిల్లవాడు చచ్చాడో, బ్రతికాడో ఏమీ తెలియడం లేదు. ఒకవేళ భగవంతుని కృపవల్ల ఆ పిల్లవాడు జీవించి ఉండి ఒకనాడు కాకపోతే ఒకనాడైనా వచ్చి “నా భూమి ఏది?” అంటే సమాధానం చెప్పాల్సిన బాధ్యత గ్రామానికి ప్రభువులమైన మాకు ఉంటుంది. కాని ఆ కొమరయ్య కేముంటుంది? పైగా ‘అన్యాయంగా ఒకని భూమి ఇంకొకడు అనుభవిస్తుంటే చూస్తూ ఏం చేస్తున్నారు?’ అని ప్రభుత్వం మమ్ములనే అడుగుతుంది. ఇవన్నీ ఆలోచించి, ఆ భూమిని నాపేర మార్చుకుందామనుకున్నాను. ఎప్పటికైనా

ఆ బ్రాహ్మణుడు బ్రతికి బాగుపడుతాడు. నాకు ప్రభుత్వంతో మాటరాదు.''

''అంటే ఆ బ్రాహ్మణుడు వచ్చి అడిగినప్పుడు ఆ భూమి అతనికి ఇచ్చి వేయాల్సనేగా మీ అభిప్రాయం? అవునులేండి, మీకేం భూములు తక్కువ గనకనా, ఇతరుల భూమికి ఆశపడేది?''

''అవును మరి. ఇప్పుడు నీ భూమి సంగతే చూడరాదూ? ఏదో కారణమనుకో, ఎప్పుడో తీసికున్న భూమిని ఇప్పుడు నీకు తిరిగి ఇస్తున్నానంటున్నానా లేదా? ఇదికూడా అంతే.''

''అయితే, ఇందులో నన్నేమి చేయమంటారు?''

'' ఏమీలేదు. కచేరీలో 'వెంకటేశ్వర్లు హాజర్ హై' అని పిలుస్తారు. అప్పుడు నీవే వెంకటేశ్వర్లునని చెప్పాలె. ఆభూమి నాకు అమ్మివేస్తున్నట్టు, దానికింద మొత్తం పైకం ముట్టినట్టు, మీకు ఇంకా ఎవరు వారసులు లేనట్టు చెప్పాలె.''

''నా పేరు వెంకటాచారి గదండీ? మరి వాండ్లు 'వెంకటేశ్వర్లు' అని ఎందుకంటారు?''

''అది కాదయ్యా. ఆ బ్రాహ్మణుడు చచ్చినప్పుడు అతనికొక పసి పిల్లవాడున్నాడంటినే అతని పేరు వెంకటేశ్వర్లు. ఆ వెంకటేశ్వర్లు నీవేనని అక్కడ చెప్పాలె. ఈ మాత్రం అర్థం కాదా? నీవు ఒట్టి మొద్దువని అందరనేది నిజమే.'' అని రామభూపాల్‌రావు గద్దించాడు.

వెంకటాచారి దేబెముఖం వేశాడు. ఇంకా వివరంగా ఏమేమో అడుగాలని అనుకున్నాడు. కాని రామభూపాల్‌రావు గద్దింపుతో గొంతు నొక్కినట్టయింది. ''సరే'' అని నీళ్ళు మింగాడు.

''బండిని తొందరగా పోనియ్యి'' రామభూపాల్‌రావు అధికార ధ్వనితో ఆజ్ఞాపించాడు. ''అన్నీ అర్థమైనట్టేనా? మళ్ళా అక్కడికి పోయిన తర్వాత 'దద్దదా' అంటావా?'' అని మళ్ళా వెంకటాచారిని కోప పడ్డాడు. కచ్చడంలో వెల్లకిల పడుకొని కాళ్ళు చాపాడు.

వెంకటాచారి ముఖం కందిపోయింది. అంగీకారసూచకంగా తల ఊపాడు. తెల్లముఖం వేసుకొని రామభూపాల్‌రావును చూచాడు.

రామభూపాల్‌రావు తన భావి కార్యక్రమాన్ని ఆలోచించ సాగాడు. కండ్లు మూసి, మీసాలను పైకి దువ్వాడు.

బండిని వడిగా ఉరికించాడు వెంకటాచారి. వెంకటాచారి ఆలోచించాల్సిన అవసరమేమీ లేదనుకున్నాడు. ఆలోచించజాలడు కూడా తండ్రి కాలములో పోయిన భూమిని తిరిగి రామభూపాల్‌రావు యిస్తున్నాడన్న సంతోషం ఒక వైపు, ఏమైనా సందేహాలు అడిగితే రామభూపాల్‌రావు కోపపడ్తాడన్న భయం ఒక వైపు కలిగి ఏమీ మాట్లాడక గంభీరించి ఊరుకున్నాడు.

(మిగతా వచ్చే సంచికలో)

Disclaimer:

ప్రజాకళలో  ప్రచురించిన రచనల్లో ఆయా రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయలతో ప్రజాకళకు అంగీకారం కానీ తిరస్కారం కానీ లేవు. ఒక ప్రజాస్వామిక సాహిత్య వాతావరణం ఏర్పాటు చేసే ప్రయత్నంలో అన్ని రకాల ప్రజాస్వామిక అభిప్రాయాలకు జాగా ఇవ్వాలనేదే మా ప్రయత్నం. అందుకనే విభిన్న అభిప్రాయాలని ప్రకటించే రచనలని మేము ప్రచురిస్తున్నాం. ఈ రచనల పై పాఠకులనుండి నిర్మాణాత్మక చర్చను ఆహ్వానిస్తున్నాం. దయచేసి మీ అభిప్రాయాలని తెలుగులో రాయండి. ఉపయోగకరమైన చర్చ జరిగేందుకు తోడ్పడండి.

------ ------  ముగింపు  ----------------